వేదాంతభేరి

మే 2018 రూ. 10/-



Regd.No. TRP / 123 / 2018 - 20 May 2018 Rs.10/- R.No.8139/63

Date of Publication 26-04-2018, Permitted to post : 29th, 30th every month.

శ్రీ విద్యాప్రకాశానంద స్వాములవారి 20వ ఆరాధనోత్సవము

ఈ పేజీ స్థల దాతలు

సుభద్రా చారిటబుల్ ట్రస్టు

హైదరాబాద్, తెలంగాణ రాష్ట్రం

ఓం వేదాంతభేరి ఓం

సంస్థాపకులు : శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు

సంపుటము : 51 మే 2018 సంచిక : 05

సంపాదకులు

శ్రీ విద్యాస్వరూపానందగిరి స్వాములవారు

సంపాదక మండలి

శ్రీవిజయానంద బ్రహ్మచారి

కె.ఈశ్వర్

డాక్టర్ సముద్రాల లక్ష్మణయ్య,శిరోమణి, ఎం.ఎ.,

డాక్టర్ కె.సర్వోత్తమరావు,ఎం.ఎ., పి.హెచ్.డి.,

శాశ్వత పోషక చందా రూ. 1500/- అంతకుమించి

సంవత్సర చందా రూ. 100/-లు , విడి సంచిక రూ. 10/-లు

విదేశాలకు సంవత్సర చందా (ఎయిర్ మెయిలు) 20 డాలర్లు

చందా పంపవలసిన అడ్రసు :

శ్రీ శుకబ్రహ్మాశ్రమము,
స్వామి విద్యాప్రకాశానంద నగర్,
శ్రీ శుకబ్రహ్మాశ్రమము (పోస్టు)
శ్రీకాళహస్తి, పిన్ - 517640
ఫోన్ : 08578- 222239

చందాదారులు ఉత్తర ప్రత్యుత్తరాలలో తమ చందా నెంబరు తప్పక వ్రాయవలెను.

Printed & Published by Sri Vidyaswarupanandagiri swami on behalf of Sri Sukabrahma Ashramam and Printed by B.Viswanadham at C.N. Printer, TIRUPATI, Andhra Pradesh; Published at Sri Sukabramhasramam, Swami Vidyaprakashananda Nagar, Sri Sukabramhasramam Post, Srikalahasti-517 640, Chittoor Dist., Andhra Pradesh.

Editor : SRI VIDYASWARUPANANDA GIRI SWAMI

ఓం వేదాంతభేరి ఓం

అనుష్ఠాన వేదాన్తాన్ని బోధించు మాసపత్రిక

సంపుటము : 51 మే 2018 సంచిక : 05

విషయ సూచిక

01. ప్రార్థన - 05

02. దేవుడు ఎందుకు కానరాడు

- శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు - 06

03. సంస్కృత విద్య - శ్రీ సద్గురు మలయాళస్వాములవారు - 11

04. శ్రీరామకృష్ణ కథామృతము - శ్రీరామకృష్ణ పరమహంస - 15

05. మాతృవాణి - సురేంద్రనాథరాయ్ - 17

06. సహనమూర్తి శ్రీ సద్గురు స్వామి - డా॥సముద్రాల లక్ష్మణయ్య - 18

07. జ్ఞాన సుధ - శ్రీసర్వభూషణ శివయోగి - 22

08. హనుమంతుడు - శ్రీ విద్యాప్రకాశానందగిరిస్వాములవారు - 23

09. భాగవత కథలు - శ్రీరామచంద్రడొంగరేమహరాజ్ - 33

10. అద్వేష్టా సర్వభూతానాం - ఆచార్య కె.సర్వోత్తమరావు - 36

11. శైవ సిద్ధాన్తము - కాశ్మీర్ శైవము - 40

13. వార్తలు - 42

ముఖచిత్రం :

శ్రీరామ భక్త శిఖామణి హనుమంతుడు

10-05-2018 శ్రీ హనుమజ్జయన్తి

ఇందులోని వ్యాసముల భావములకు వ్యాస రచయితలే బాధ్యులు

ప్రార్థన

01. గోష్పదీకృత వారాశిం మశకీకృత రాక్షసమ్ ।
రామాయణమహామాలారత్నం వందే ఽనిలాత్మజమ్ ॥

02. ఓం అంజనానందనం వీరం జానకీ శోకనాశనమ్ ।
కపీశం అక్షహంతారం వందే లంకా భయంకరమ్ ॥

03. ఆమిషీకృతమార్తాండం గోష్పదీకృత సాగరమ్ ।
తృణీకృతదశగ్రీవం ఆంజనేయం నమామ్యహమ్ ॥

04. ఉదయాదిత్య సంకాశం ఉదార భుజవిక్రమమ్ ।
కందర్పకోటిలావణ్యం సర్వవిద్యా విశారదమ్ ॥

05. శ్రీరామ హృదయానందం భక్తకల్పమహీరుహమ్ ।
అభయం వరదం దోర్భ్యాం కలయే మారుతాత్మజమ్ ॥

06. ఆంజనేయం అతిపాటలాననం
కాంచనాద్రి కమనీయ విగ్రహమ్ ।
పారిజాత తరుమూల వాసినం
భావయామి పవమాన నందనమ్ ॥

07. అతులిత బలధామం స్వర్ణశైలాభదేహం
దనుజవనకృశానుం జ్ఞానినామగ్రగణ్యమ్ ।
సకల గుణనిధానం వానరాణాం అధీశం
రఘుపతి ప్రియభక్తం వాతజాతం నమామి ॥

08. మనోజవం మారుతతుల్యవేగం
జితేంద్రియం బుద్ధిమతాం వరిష్ఠమ్ ।
వాతాత్మజం వానరయూథముఖ్యం
శ్రీరామదూతం శిరసా నమామి ॥

దేవుడు ఎందుకు కానరాడు?

- శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు

భౌతిక నేత్రము పంచభూతములచే ఏర్పడినది. అది జడమైనది. కావున అది స్థూలపదార్థములనే చూడగల్గును. ఆత్మయో అతిసూక్ష్మమైనది. అతి సూక్ష్మమగు ఆత్మను స్థూలమగు చర్మ చక్షువు చూడజాలదు.

'సూక్ష్మత్వాత్తదవిజ్ఞేయం' అని గీతాచార్యుడీ సత్యమునే వెల్లడించి యున్నాడు. కావున పరమాత్మను వీక్షించుటకు ఈ చర్మ నేత్రములకు సామర్థ్యము లేదని స్పష్టమగుచున్నది.

కొందఱు ఈ ప్రకారముగ ప్రశ్నించుదురు – 'అయ్యా' దేవుడనేవాడు ఉన్నచో మాకేల కనిపించడు. ప్రపంచములోని అన్ని వస్తువులు కనిపించుచున్నవి కదా ! మఱి దేవుడు మాత్రము ఎందులకు కానరాడు. కనిపించినచో దేవునిపై మాకు ఎంతయో విశ్వాసము కలుగును గదా. కనుపించని దేవునిపై మాకు విశ్వాసము ఎట్లు కుదురును ?' దీనికి సమాధానము – ప్రపంచములో కనుపించని వస్తువు లెన్నియో ఉన్నను వానిపై జనులు విశ్వాసము కలిగియున్నారు. గాలి కనిపించదు. ఆకాశము కనుపించదు. ఎవరి కన్ను వారికి కనుపించదు. ఎవరి వీపు వారికి కనుపించదు. ఈ ప్రకారముగ స్థూలమైన వస్తువులే కొన్ని కానరాకుండగా, ఇక సూక్ష్మాతి సూక్ష్మతరమైన మనస్సు గూడ అవలోకించనట్టి ఆత్మ భౌతిక నేత్రమునకు ఎట్లు గోచరించగలదు? అట్లు గోచరించనంత మాత్రమున అది లేదని ఎట్లు చెప్పగలము. ?

దృశ్యతే త్వగ్రయా బుద్ధ్యా
సూక్ష్మయా సూక్ష్మదర్శిభిః

అతి సూక్ష్మమైన విజ్ఞాన నేత్రముచే ఏకాగ్ర బుద్ధిచే, మహనీయులు పరమాత్మను వీక్షింపగల్గుచున్నారని శ్రుతి భగవతి పేర్కొను చున్నది.

అర్జునుడు రణరంగమున విశ్వరూపమును చూపుమని శ్రీకృష్ణమూర్తిని ప్రార్థింపగా.

న తు మాం శక్యశే ద్రష్టుమనేనైవ స్వచక్షుషా

దివ్యం దదామి తే చక్షుః పశ్య మే రూపమైశ్వరమ్.

' ఓ అర్జునా ! ఈ చర్మనేత్రముచే నీవు విశ్వరూపమును చూడజాలవు. నీకు దివ్యనేత్రమును ఒసంగుచున్నాను. దానిచే నీవు అద్దానిని వీక్షింపగలవు' అని వచించి భక్తునిపై గల వాత్సల్యాతిశయముచే దివ్యచక్షువును ప్రసాదించెను. అట్టి దివ్య నేత్రముచే ధనుంజయుడు భగవానుని అద్భుత విశ్వరూపమును చూడగల్గెను. కాబట్టి దైవదర్శనము (ఆత్మసాక్షాత్కారము) భౌతిక నేత్రము ద్వారా వీలుపడదు. దానికి దివ్యనేత్రము, జ్ఞాన నేత్రము అత్యావశ్యకము. స్థూలవస్తువు సూక్ష్మ వస్తువును ఎన్నటికిని చూడజాలదు. అట్టిచో స్థూలవస్తువగు భౌతిక నేత్రము సూక్ష్మతరమగు పరమాత్మను ఎట్లు చూడగల్గును ? కాబట్టి భగవద్దర్శనమునకై జీవుడు జ్ఞాన నేత్రమును తప్పక సంసాదించవలసి యున్నాడు.

జ్ఞాననేత్రము భౌతిక పదార్థమువలె బయట లభించు వస్తువు కాదు. అది లోనివస్తువు. నిత్యానిత్య వివేకమే జ్ఞాన నేత్రము. ఆత్మానాత్మ వివేకమే జ్ఞాన నేత్రము. పుష్పమాలలో పుష్పములను చర్మనేత్రము చూచుచున్నది. లోని దారమును జ్ఞానచక్షువు అవలోకించుచున్నది. ఒకానొక వ్యక్తిని చూచినపుడు శరీరముయొక్క బాహ్య స్వరూపమును అనగా రక్తమాంసమయమగు బాహ్య ఆకృతికిని కన్ను చూచుచున్నది. కాని లోన వెలుగుచున్న శాశ్వత పరమాత్మను, దివ్యమగు ఆత్మస్వరూపమును జ్ఞాన నేత్రము వీక్షించుచున్నది. భౌతిక నేత్రములకు అగోచరమగు అతి సూక్ష్మమగు అభ్యంతర పదార్థమును తెలిసికొనగలుగు వివేకమే జ్ఞాననేత్ర మనబడును.

ఇట్టి జ్ఞాననేత్రముయొక్క ప్రస్తావన ఉపనిషత్తులయందు, భగవద్గీతయందు, తదితర శాస్త్ర గ్రంథములందు అచటచట కానిపించు చున్నది. ఓ జనులారా ! ప్రయత్న పూర్వకముగ జ్ఞాన నేత్రమును సంపాదించుకొని విశ్వమును సాక్షాత్ భగవత్స్వరూపముగ వీక్షించుచు జీవితములను కడతేర్చుకొనుడు అని శాస్త్రములందు మహనీయులు ఉద్బోధించుచున్నారు.

' ఆవృత్తచక్షురమృతత్వమిచ్ఛన్ ' అని కఠోపనిషత్తు గంభీరముగ పలుకుచున్నది. అనగా మరణరహిత ఆత్మస్థితిని బడయదలచువాడు తన చూపును బయటనుండి లోనికి త్రిప్పవలసి యుండునని భావము. దృష్టిని బాహ్య విషయములనుండి మఱలించి, అంతర్ముఖ మొనర్చి చక్కగ ధ్యానించునపుడే ఆత్మానుభూతి కలుగగలదని ఉపనిషత్తు పేర్కొనుచున్నది. అట్టి ధ్యాన జనిత వివేకమే జ్ఞాన నేత్రము. దానిచే చూచునపుడు ప్రపంచమంతయు ఒకే దైవ స్వరూపముగ, ఒకే ఆత్మ స్వరూపముగ గోచరించును.

' తత్ర కోమోహః ? కః శోక ఏకత్వ మనుపశ్యతః ' అచట వైర మెచట? దుఃఖ మెచట ? అజ్ఞాన మెచట ? అంతయు తానై యుండ ఇక శత్రు మిత్రాది భేదముగాని, స్వకీయ పరకీయ భేదముగాని అచట ఉండనేరదు. 'సర్వం ఖలిద్వం బ్రహ్మ– నేహ నానాస్తి కించన '–ఈ ప్రపంచ మంతయు పరబ్రహ్మ స్వరూపమే. ఇచట అనేకత్వము లేనే లేదు. అను ఉపనిషత్సిద్ధాంతము అత్తఱి కార్యాన్వితమగును.

మఱియు జ్ఞాననేత్రముచే వీక్షించునపుడు జడమేదియో చైతన్యమేదియో, క్షేత్రమేదియో, క్షేత్రజ్ఞుడెవడో, నశ్వరమేదియో శాశ్వత మేదియో జీవునకు విస్పష్టముగ గోచరించును.

'క్షేత్ర క్షేత్రజ్ఞయో రేవమన్తరం జ్ఞానచక్షుషా' జ్ఞాన చక్షువుచేత క్షేత్ర క్షేత్రజ్ఞుల భేదమును చక్కగ తెలిసికొని జీవుడు పరమాత్మ పదమును బడయ గల్గుచున్నాడని గీతాచార్యులున్ను వచించి యున్నారు.

'దృష్టిం జ్ఞానమయీం కృత్వా పశ్యేత్ బ్రహ్మమయం జగత్' 'ఓయీ! నీ దృష్టిని జ్ఞానమయముగ నొనర్చుకొని, జ్ఞాన నేత్రమును సంపాదించుకొని ప్రపంచమునంతను బ్రహ్మమయముగ గాంచుము' అని శ్రీ శంకరభగవత్పాదులు ఉద్ఘోషించిరి.

ఈ ప్రకారముగ ఉపనిషత్తులేమి, భగవద్గీత యేమి, సమస్త శాస్త్రములేమి, శంకరాచార్యాది మహనీయులేమి – ముక్తకంఠముగ జ్ఞాననేత్రావలంబనముగూర్చి ఉద్బోధించి యున్నందున దాని నెట్టైన ఈ జీవితములో సాధించి తెచ్చుకొనుట ముముక్షువుల కర్తవ్యమైయున్నది.

ఎఱుపు అద్దములుగల కళ్లజోడు పెట్టుకొనిచూచినచో ప్రపంచ మంతయు ఎఱ్ఱగా కనిపించును. నలుపు అద్దములు పెట్టుకొనినచో నల్లగా కనిపించును, తెలుపు అద్దములు పెట్టుకొనినచో తెల్లగా కనిపించును. అట్లే జ్ఞానదృష్టితో వీక్షించినచో సమస్తము బ్రహ్మమయముగ గోచరించును. అజ్ఞానముచే దృష్టి అపవిత్రమైపోయినందువలన జనులకు ప్రపంచము వక్రముగా కనిపించుచున్నది. ఆ దృష్టిని శుద్ధపఱచుకొనినచో, గురుశాస్త్రోపదేశములచేతను, స్వానుభవము చేతను వినిర్మలమొనర్చు కొనినచో ప్రపంచము ప్రపంచరూపమున గాక దైవరూపముగ గోచరించును. ఇట్టి స్థితిని సాధించుటకే మానవజన్మ ఏర్పడినది. జ్ఞాననేత్ర సంపాదన కొఱకే మహోన్నతమగు మనుష్యత్వమును సార్థక పఱచుకొనుట ప్రతివానియొక్కయు విధ్యుక్త ధర్మము.

అయితే ముందుగా భక్తిని చక్కగ అభివృద్ధిపఱచు కొనవలెను. పూజా జపధ్యానాదుల ద్వారా భగవంతుని లెస్సగ ఉపాసించవలెను. అత్తఱి జీవుల భక్తికి మెచ్చి కరుణామయుడగు పరాత్పరుడు

బుద్ధియోగమును వారికి ప్రసాదించును (దదామి బుద్ధియోగం). ఆ బుద్ధి యోగమే జ్ఞాననేత్రము. అదియే దివ్యనేత్రము. అట్టి దివ్య నేత్రము చేతనే అర్జునుడు విశ్వరూపమును చక్కగ చూడగల్గి భగవంతుని సర్వవ్యాపకత్వమును లెస్సగ అవగాహనము చేసికొనగల్గెను.

భక్త్యాత్వనన్యయాశక్య అహంమేవంవిధో ఒర్జున

జ్ఞాతుం ద్రష్టుం చ తత్త్వేన ప్రవేష్టుంచ పరన్తప.

ఆ నేత్రమును ఒక్క అర్జునుడే కాదు ఎవరైనను పొందవచ్చును. అనన్యభక్తి కలిగియుండిన చాలును – అని శ్రీకృష్ణభగవానులు సెలవిచ్చియున్నారు. కాబట్టి అతి సులభమైన భక్తిని జేబట్టి భగవత్కృపకు పాత్రులై భగవదనుగ్రహముచే జ్ఞాననేత్రమును బడసి ఏది సత్యమో ఏది అసత్యమో తెలిసికొని, ఏది బింబమో ఏది ప్రతిబింబమో అవగతము చేసికొని, ఏది నిత్యమో ఏది క్షణికమో అనుభూత మొనర్చుకొని నిత్యమైన ఆత్మయందు మనస్సు నిలిపి క్షణికమైన దృశ్యపదార్థములందు వ్యామోహమును వదలి నిరతిశయ ఆత్మానందానుభూతిచే జీవితమును చరితార్థ మొనర్చుకొన వలయును.

వేదాన్తభేరికి ఈ క్రిందివారు పోషకచందా పంపినారు

(1). ఎం.ఎస్.కామాక్షి పసుమర్తి (న్యూయార్కు, యు.ఎస్.ఎ.)	రూ.5000/-
(2). మేడి జలేంద్ర రావు (సికింద్రాబాద్)	రూ.1600/-
(3). శ్రీమతి పి.నిర్మలమ్మ (కోవూరు, నెల్లూరు)	రూ.1500/-
(4). జి.శ్రీనివాస (షాద్‌నగర్) ఇదివరకు ఇచ్చినది పోను	రూ.1300/-
(5). టి.ఎం. రమేష్ (తిరుపతి)	రూ.2000/-
(6). డా॥రావిళ్ల మనోహర్ (చెన్నై)	రూ. 1500/-
(7). శ్రీమతి ఎ.లచ్చుమ్మ (నల్గొండ)	రూ.1500/-
(8). ఎం.ప్రదీపకుమార్ (సమిశ్రగూడెం)	రూ.1500/-

సంస్కృత విద్య

- శ్రీ సద్గురు మలయాళస్వాములవారు

విచారశీలురకు ప్రాకృతవిద్య అలవడిన అప్రాకృతమైన బ్రహ్మవిద్యను త్వరలో నేర్చుకొనవచ్చును. మండుచుండు అగ్నికి వాయువెంత సహాయమో, అట్లే అధ్యాత్మజ్ఞానికిన్ని విద్యావిచారము తోడ్పడును. మఱియు అనేక సిద్ధపురుషుల యొక్కయు, మహర్షుల యొక్కయు, యోగీశ్వరుల యొక్కయు, ఆశయములు సంస్క ృత విద్యయందు యుండుటచే అట్టి అమూల్యసంపదను అనుభవించుటకు సంస్కృత విద్యను నేర్చుకొనియే తీరవలయును.

శ్లో ॥ ఉల్కా హస్తోయథా కశ్చిద్ద్రవ్య మాలోక్యతాం త్యజేత్
జ్ఞానేన జ్ఞేయ మాలోక్య జ్ఞానం పశ్చాత్పరిత్యజేత్ ॥

తా ॥ కొరివికట్టె చేతిలో గలవాడు చీకటిలోనుండిన ద్రవ్యమును గనుంగొనిన పిదప నెటుల దానిని వదలునో, యా విధంబున జ్ఞాన సాధనంబుచే జ్ఞేయంబైన బ్రహ్మ సాక్షాత్కారంబు గల్గిన పిదప నా సాధనమైన శాస్త్రంబును వదలవచ్చును. ఇచ్చోట శాస్త్రముగూడ వాసనాత్రయముతో చేరినదని కొందరు చెప్పుదురు. అది తర్క వ్యాకరణాది షట్శాస్త్రములే గాని బ్రహ్మవిద్యయగు వేదాంతశాస్త్రము గాదు. ఏలన వేదాంతశాస్త్రము నిర్వాసన స్థితిని బోధించున దగుటచేత పై జెప్పిన శాస్త్రవాసనలతో జేరినదిగాదు. ఐనను ముముక్షువులు ఒక్క రహస్యమును మనసులో నుంచుకొని శాస్త్రము చదువవలెను. లేనిచో శ్రమయే మిగులును. ఆ విషయమై శ్రీ కృష్ణదేవుడే సెలవిచ్చి యున్నాడు.

శ్లో ॥ అధీత్య చతురో వేదాన్ ధర్మశాస్త్రాణ్యనేకశః
బ్రహ్మతత్వం న జానాతి దర్వీ పాకరసం యథా ॥

తా ॥ నాల్గు వేదములను చదివినను, సమస్త ధర్మశాస్త్రములను చూచినను బ్రహ్మతత్వమును సద్గురువును ప్రార్థించి తెలిసికొనక పోయినచో వాని విద్యలు అనేక పక్వాన్నాదులలో తిరిగెడు గరిటె వాని రుచినెట్లు తెలిసికొనజాలదో అట్లే వీడున్ను ఆ గరిటెకు సమానమే.

శ్లో ॥ యథా ఖరశ్చందన భారవాహీ
భారస్య వేత్తా నతు చన్దనస్య
తథైవ శాస్త్రాణి బహూన్యధీత్య
సారం నజానన్ ఖరవద్వహేత్సః ॥

తా ॥ మంచి చందనము, అత్తరు, కుంకుమ, కస్తూరి గోరోజనాది సుగంధ ద్రవ్యములను మోయు గార్దభంబు దాని పరిమళ మెరుంగ నటుల సకల వేదాశాస్త్రంబులు చదివియును, తత్సారాంశంబగు పరమ పురుషుని (భగవంతుని) ఎరుంగక పోయినయెడల వాడును గార్దభము వంటివాడే యగును.

ఇక ఒక విషయము విద్యార్థులు జ్ఞప్తిలో నుంచుకొని వర్తింపవలసిన దత్యవసరము. ఆదేమన మీలో కొందరికి సంస్కృతము గ్రహించదగిన మేధాసంపత్తి లేదని తలంచవచ్చును. అట్టి తలంపు పనిలేదు. శ్రద్ధయుండిన ఏ విద్యయు సులభముగా లభించును. కమ్మర పనివారుగాని సువర్ణ పనివారుగాని బొగ్గులో కొంచెము నిప్పు వేసి ఊదగా నూదగ ఆ బొగ్గంతయు నిప్పై మారునట్లు సాధన చేయగ చేయగ మేధాశక్తి వికసించును.

శ్లో ॥ ఆస్థాస్వాస్థా యదిస్యాతాం మేధయా కిం ప్రయోజనం
తే ఉభే యదిస్యాతాం మేధయా కిం ప్రయోజనమ్ ॥

తా ॥ మంచి ఆసక్తి స్థిరముగా గలవానికి మేధాశక్తి లేనప్పటికిన్ని గొప్ప

Fo

శక్తి కల్గును. గొప్ప మేధాశక్తి యుండియు దృఢమైన శ్రద్ధ లేనిచో యేలాటి ఉపయోగముండదు. ఈ విషయమై శ్రీకృష్ణ పరమాత్మ గీతయందు బోధించినది చూడుడు.

శ్లో ॥ శ్రద్ధావాన్ లభతే జ్ఞానం తత్పర స్సంయతేన్ద్రియః
జ్ఞానం లబ్ధ్వా పరాం శాన్తి మచిరేణాధిగచ్ఛతి ॥

తా ॥ శ్రద్ధయు, జ్ఞానాపేక్షయు, ఇంద్రియ నిగ్రహము గల పురుషుడు జ్ఞానమును త్వరలో బొందును. అట్లు జ్ఞానమును పొందిన యతి శీఘ్రముగ నుత్కృష్టమైన చిత్తోపరతిని పొందును.

యోగీశ్వరుడగు శ్రీ భర్తృహరి విద్యా విషయమై నుడివినది గమనింపుడు.

శ్లో ॥ విద్యా నామ నరస్య రూపమధికం ప్రచ్ఛన్న గుప్తం ధనం
విద్యాభోగకరీ యశః సుఖకరీ విద్యా గురూణాం గురుః
విద్యా బంధుజనో విదేశగమనే విద్యా పరాదేవతా
విద్యా రాజసుపూజ్యతే నహి ధనం విద్యా విహీనఃపశుః ॥

తా ॥ మానవునకు అన్ని రూపములకంటె విద్య అతి మనోహరమైన సౌందర్యము, రహస్యముగ దాచిపెట్టబడిన ధనము. విద్యయే సకల భోగములను కీర్తిని సుఖమును యిచ్చునది. విద్యయే గురువువలె అన్నిటిని బోధించును. పరదేశమునందు చుట్టమువలె సహాయ మొనర్చును. విద్యయే అన్ని దేవతలకంటె గొప్ప దేవత. విద్యయే రాజులచేత పూజింపబడునది. ధనము ధనము కాదు. విద్యా ధనమే ధనము. విద్య లేనివాడు పశువుతో సమానుడు.

శ్లో ॥ శునః పుచ్ఛమివ వ్యర్థం జీవితం విద్యయా వినా
అగోపయతు గోప్యాంగ మనివార్యతు మక్షికాన్ ॥

తా ॥ విద్యలేని మానవజన్మము కుక్కతోక వలె వ్యర్థము. అనగా కుక్కతోక దానియొక్క మర్మస్థానమును మరుగుపరచుటకున్ను, దేహమును బాధించెడు ఈగలను తోలుటకున్ను ఉపయోగపడదు. ఇతర జంతువుల తోకలు ఈగల బాధ తొలగించుకొనుటకున్ను, గోప్యస్థలమును మరగుపరచుటకున్ను ఉపయోగపడును. కనుక విద్యావిహీనుడు కేవలము భూమికి భారమేగాని వాని వలన కొంచెమైనను ఉపయోగము లేదు.

శ్లో ॥ రూపయౌవన సంపన్నాః విశాలకులసంభవాః
విద్యాహీనా నశోభంతే నిర్గంధా ఇవ కింశుకాః ॥

తా ॥ రూపము, యౌవనము, ధనముతో గూడి చక్కనివాడైనను, మంచి కులములో పుట్టినను, విద్యలేనిచో వాని జీవితము నిరుపయోగము. ఎట్లన మంచి వర్ణముతోను వికాసముతోను గూడిన బాడిశ పుష్పమువలె వాసనయోగ్యము గాకయుండును. ఇచ్చట 'హంస మధ్య బకోయథా " అని పాఠము గూడ గలదు. అనగా హంసపక్షి గుంపులో కొంగ యెట్లు ప్రకాశింపదో ఆలాగున విద్యావిహీనుడు సర్వైశ్వర్యములుండినను జనమధ్యములో శోభింపడు. మఱియు విద్యలేనివానిని మేకగళ స్తనములవలె వర్ణించియున్నారు. మేక కంఠములో కొన్నింటికి స్తనము లుండును. అయితే కేవలము అవి పరిహాసపాత్రములేగాని పాలు వుండనట్లు విద్య లేని జన్మముగూడ అటువంటిదే యగును. కనుక ప్రయత్నపడి విద్య నభ్యసింపుడు.

"త్రినేత్ర వైద్యాలయ ట్రస్టు " కు ఈక్రింది వారు పైకం పంపినారు

(1).	అత్యం వెంకటాచలం (పెనుగొండ)	రూ. 22,563/–
(2).	ఎన్.రామకృష్ణారావు (హైద్రాబాద్)	రూ. 20,000/–
(3).	వినాయక నాగనాథ్ కోటా (షోలాపూర్)	రూ. 20001/–
(4).	బోరి శివసూర్యనారాయణ (విశాఖపట్టణం)	రూ. 10,000/–
(5).	శ్రీమతి పసుపులేటి సంధ్యారాణి (శ్రీకాళహస్తి)	రూ. 10,000/–
(6).	శ్రీమతి ఆరతి (సికింద్రాబాద్)	రూ. 10,116/–

వేదాన్తభేరి ... చం
మురళీధర కృష్ణుడు
ollow the master

శ్రీరామకృష్ణ కథామృతము

– శ్రీ రామకృష్ణ పరమహంస

(శ్రీరామకృష్ణ పరమహంస కంఠంలో వ్రణం వున్నప్పుడు)

శ్రీరామకృష్ణులు అంతర్ముఖులయ్యారు. భక్తులు పువ్వులు, మాలలు భక్తి పూర్వకంగా ఆయన ఎదుట సమర్పించారు. ఒక పుష్పాన్ని తీసుకొని ఆయన దానితో తన శిరస్సు, కంఠం హృదయం, నాభిని స్పృశించారు. ప్రస్తుతం ఆయన 'మ'తో మాట్లాడసాగారు.

శ్రీరామకృష్ణులు – వాయువు ఊర్ధ్వగమనం ఎప్పుడు చేసిందో తెలియదు. ప్రస్తుతం నేను బాలక భావంలో ఉన్నాను. అందుకే పువ్వులతో ఇలా అనుకొంటున్నాను. ప్రస్తుతం నేను ఏం చేస్తున్నానో తెలుసా ? ఈ దేహాన్ని వెదురుబద్ధలతో చేసినట్లు, దాన్ని గుడ్డతో కప్పి వున్నట్లు చూస్తున్నాను. అదే తిరుగుతోంది. లోపల ఎవరో నివసించడం వలననే అది అలా తిరుగుతోంది.

ఇంకా నేను ఈ దేహాన్ని విత్తనాలు తీసివేసిన గుమ్మడి పండులా చూస్తున్నాను. ఈ దేహం లోపల కామం, ఆసక్తి ఏదీ లేదు. లోపల శుభ్రంగా వుంది.

అఖండ సచ్చిదానందాన్ని నేను లోపల, బయటా రెండుచోట్లా చూస్తున్నాను. అది ఈ కోశాన్ని (తమదేహాన్ని) కేవలం ఆధారంగా మాత్రమే చేసుకొని ఈ కోశం లోపలా, బయటా ఉంటోంది. దీన్ని నేను స్పష్టంగా చూస్తున్నాను. మీరందరు నా ఆత్మీయులుగా తోస్తున్నారు. మీలో ఎవర్నీ నేను పరాయివానిగా భావించడం లేదు. నా మనస్సు భగవంతునితో యోగం చెందినప్పుడు దేహానికి చెందిన ఈ కష్టం ఒకవైపు పడివున్నట్లుగా చూస్తున్నాను. ప్రస్తుతం నేను చూస్తున్నది ఇదే. అఖండ సచ్చిదానందం చర్మంతో కప్పబడి ఉంది. కంఠంలోని వ్రణం ఒకవైపు పడి వుంది.

శ్రీరామకృష్ణులు మౌనంగా ఉండినారు. కాసేపటి తరువాత ఇలా

అన్నారు. " జడపదార్థపు సత్తా చైతన్యం మీదా, చైతన్యపు సత్తా జడంమీద ఆపాదించబడి వున్నవి. అందుకే దేహానికి జబ్బు చేసినపుడు మనిషి నాకు జబ్బు చేసింది అంటాడు. ఆ కష్టాలు దేహానికి చెందినవి. నరేంద్రుడు –

ఉండేది నీ వొకడివే
ఈ సర్వము నే మయమే
నా హృదయము నీ తోనే
తన్మయముగా భావించితివి
నిన్నొకనిగా కనుగొంటిని
ఉండేది నీ వొకడివే
ఓ దేవా ! హృదయేశా !
సర్వైకావాస గృహా !
నీ ఉండని దే హృదయము ?
వసియించెద వందరిలో
ఉండేది నీ వొకడివే
ఈ సర్వము నీ మయమే ॥ఉండేది॥

(కథామృతం 425 పేజీ)

ఎవడు బ్రాహ్మణుడు ?

మూలం ॥ ఉండేది ॥ అనువాదం

బుద్ధుని ధర్మపదం – బ్రహ్మచారి ఆనందమోహన్

గృహ వైద్యము

అశ్వగంధి ఆకులను మెత్తగా నూరి తామర, గజ్జి, చిడుము మొదలగు చర్మవ్యాధులున్న చోట పట్టు వేస్తే పదిరోజులలో అన్ని చర్మరోగాలు పోతవి.

నిమ్మకాయ రసంలో కాసిన్ని నీళ్లు కలిపి పిచికారి చేస్తే చీమలు వెళ్లిపోతాయి.

చీమలు బారులున్నచోట ఉప్పును చల్లితే చీమలు పారిపోతాయి.

మాతృవాణి

– సురేంద్రనాథరాయ్

నేను : అమ్మా ! ఆత్మజ్ఞానం సంతరించుకొన్న మనిషి, భగవంతుడు వీరి మధ్యగల వ్యత్యాసం ఏమిటి?

మాతృదేవి : మనిషే దేవుడవుతాడు. పాటుపడితే అంతా సాధ్యమే.

నేను : ఎలా పాటుపడాలి ?

మాతృదేవి : గురుదేవులు చెప్పినట్లు త్రోసి పుచ్చవలసిన వాటిని త్రోసిపుచ్చి, స్వీకరించవలసిన వాటిని స్వీకరించి, ఇష్టదైవాన్ని ఏకాగ్రచిత్తంతో ప్రార్థిస్తే అంతా సుసాధ్యమే.

నేను : అమ్మా ! కాశీ సందర్శనం వలన పుణ్యం లభిస్తుంది. కాని పేదోళ్లు వెళ్లలేరు కదా ! వారికి ఆ పుణ్యం ఎలా లభిస్తుంది.

మాతృదేవి : దక్షిణేశ్వరానికో, బేలూరు మఠానికో వెళితే అదే పుణ్యం లభిస్తుంది. కాని నిజమైన విశ్వాసం ఉండాలి. కాశీలో వెలసి వున్నవారే దక్షిణేశ్వరంలోను,బేలూరు మఠంలోను వెలసి వున్నారు.

నేను : అమ్మా ! మాకు మార్గాంతరమేమిటి ?

మాతృదేవి : భయమెందుకు ? గురుదేవుల అనుగ్రహానికి పాత్రులైన వారికి, ఆయనతో సంసర్గం కలిగి వున్నవారికి అవసరమైనవన్నీ ఆయనే సమకూర్చి పెడుతారు.

నేను : అమ్మా ! జపధ్యానాదులకు ఎటువంటి నియమాలు పాటించాలి?

మాతృదేవి : నీ ఇష్టానుసారం అనుష్ఠించు. కాని మనస్సును భగవంతునిపై లగ్నమై ఉండాలి. అలా చేస్తే అన్ని సిద్ధిస్తాయి.

(శ్రీ శారదాదేవి వచనామృతం నుండి)

శ్రీ మలయాళస్వామి జీవిత విశేషాలు - 7

సహనమూర్తి శ్రీ సద్గురు స్వామి

– డా ॥ సముద్రాల లక్ష్మణయ్య, (తిరుపతి)

'విజయః సర్వకార్యేషు సహనేనైవ లభ్యతే ' ' సర్వ కార్యాలలోనూ సహనంతోనే విజయం సిద్ధిస్తుంది ' అని శ్రీ వివేకానందులవాణి.

'న తితిక్షాసమమస్తి సాధనమ్ ' ' ఓర్పుతో సమానమైన సాధనం మరొకటి లేదు' అని సుభాషితం.

సహనం సర్వ దుఃఖానా మప్రతీకార పూర్వకమ్ ।
చింతావిలాప రహితం సా తితిక్షా నిగద్యతే ॥ అని శ్రీ శంకర భగవత్పాదులు తితిక్షకు ఇచ్చిన నిర్వచనం. అంటే ప్రతీకారం చేయాలనే ఆలోచన లేకుండా, చింతా విలాపాలు లేకుండా, సకల దుఃఖాలనూ సహించుకోవడమే 'తితిక్ష' అనబడుతుంది. శమాది షట్క సంపత్తిలో ఇదొకటి.

భగవత్ప్రీతికరమైన 'అహింస' మున్నగు ఎనిమిది పుష్పాలలో క్షమగూడా ఒకటి. బుద్ధ భగవానుని క్షమాగుణం ఎంతో గొప్పదని ఆ మహనీయుని చరిత్ర నుండి తెలుస్తున్నది.

అట్లాగే మన గురుదేవులు శ్రీమలయాళస్వాములవారి క్షమాగుణం ఎంత ప్రశస్తమైనదో తెలుసుకొందాం. వారు సర్వసమభావంతో 'శుష్కవేదాంతతమో భాస్కరం' అనే గ్రంథం (1919)లో వ్రాశారు. అందులో విషమ భావాలను నిశితంగా ఖండించారు. శుష్క వేదాంతులను తీవ్రంగా నిరసించారు. అప్పుడు సనాతనులు వారినెంతగానో దూషించారు. అయినా వారు తమ సహనాన్ని కోల్పోలేదు. ఆ విషయాన్నే దృష్టిలో పెట్టుకొని వరదదాస కవి.

గంజాయి సాధులు కనలి మిమ్మెదిరించి
వంచనచేత దూషించునపుడు
వ్యభిచార జ్ఞానులు సభలో పెడర్థంబు
లగు ప్రశ్నలను వేసి యలచునపుడు
వైద్యవేదాంతులు పగబూని మీపైని
కయ్యానికై కాలు కదపునపుడు
ద్రవ్యాశ విప్రులు దండికోపంబున
మిమ్ము బాధింపంగ గ్రమ్మినపుడ
భూమివంటి యోర్పును మదిబూని వారి
కెల్లవేళల మేలునే యెంచినావు
కలుషదూర ! వ్యాసాశ్రమస్థల విహార !
పరమకారుణ్య ! మలయాళ గురువరేణ్య !
(శ్రీ మలయాళ సద్గురు స్మరణామృతం)

అని శ్రీవారి సహనగుణాన్ని శ్లాఘించాడు.

సుప్రసిద్ధ సంస్కరణ వాదులైన శ్రీ త్రిపురనేని రామస్వామి చౌదరి వంటివారు గూడా స్వామిని ప్రతిఘటించిన సందర్భాలున్నాయి. ఆ తరువాత చాలా రోజులకుగానీ శ్రీవారి సంస్కరణ విధానం వారికర్థం కాలేదు.

ఒక వ్యక్తి స్వామిని దూషిస్తూ కరపత్రాలు ప్రచురించి జనానీకంలో పంచాడు. అప్పుడు శిష్యులు ఈ విషయం శ్రీ స్వామివారి దృష్టికి తీసుకుపోగా వారు 'మనల్ని ఎందరో పొగడుతూ పుస్తకాలు వ్రాశారు. కరపత్రాలు వేశారు. అప్పుడు మనకు లేనిది వచ్చిందా ? ఇప్పుడు మనకున్నదేమైనా పోతుందా ? అన్నారు.

'వాటిని అచ్చువేశాడు స్వామీ ! అని శిష్యులనగా స్వామి " మంచిది దానివల్ల పేద ప్రెస్‌పనివారికి పని కల్పించినట్లవుతుంది. వారు సంతోషిస్తారు. మన తప్పులు చూపేవారు మన కవసరమే. అందువల్ల మనం ఇంకా జాగ్రత్తగా ఉంటాము" అని చెప్పారు.

జ్ఞానయజ్ఞాలు నిర్వహించేటప్పుడు యజ్ఞశాలకు దుండగులు నిప్పంటించిన ఘటనలు గూడా జరిగాయి. అయినా స్వామి సహనం కోల్పోలేదు. 'మానావమానయో స్తుల్యః' అనే గీతావచనాన్ని సార్థకం కావించిన మహనీయులు మన గురుదేవులు.

తెలప్రోలువాసి శ్రీ ఆరుమళ్ళ సుబ్బారెడ్డి అనే వ్యక్తి 1936లో నాల్గువందలమంది అనుచరులతో వచ్చి స్వామిని తీవ్రంగా నిందించాడు. ఇలాంటి సాధువులు లోకానికి చీడపురుగులైనారని ఆక్రోశించాడు. శిష్యులు ఈ విషయాన్ని స్వామి దృష్టికి తేగా " రైలింజన్ ఎంత వేగంతో ముందుకు పోతుందో, అంతేవేగంగా వెనుకకు గూడా వస్తుందిలే " అని అన్నారు.

చివరికి శ్రీవారు అన్నట్లే జరిగింది. ఆ రెడ్డి నాల్గు సంవత్సరాల తరువాత తన తప్పు గ్రహించి వచ్చి స్వామికి శరణాగతుడయ్యాడు. తుదకు ఆధ్యాత్మిక పథంలో ప్రవేశించి సన్న్యాసం స్వీకరించాడు. "సమత్వానందస్వామి" అన్న పేరుతో ప్రసిద్ధి వహించాడు.

తరువాత బుద్ధుని జీవితంతో పోలుస్తూ శ్రీస్వామివారి జీవితాన్ని గురించి 'అసంగానంద గౌతమ బుద్ధులు " అనే గ్రంథం రచించాడు. ఎంతో రమణీయమైన గ్రంథమది. శ్రీమలయాళస్వామి సన్న్యాసినామం అసంగానందులు.

స్వామి నిర్వహించే సనాతన వేదాంత జ్ఞాన సభలలో స్వామికి తోడ్పాటుగా వుండి, సమత్వానందస్వామి శ్రీవారి ప్రశాంత ప్రవచనాన్ని తన ఉచ్చైః స్వరంతో పునరుక్తం చేసి భక్తులకు వినిపించేవాడు. అతని గంభీరకంఠస్వరం అందరికీ ఆనందం కల్గించేది.

స్వామి క్షమాగుణాన్ని బుద్ధుని క్షమతో పోలుస్తూ 'అసంగానంద

గౌతమబుద్ధులు ' అను రచనలో శ్రీసమత్వానందస్వామి చెప్పిన మాటలు గమనించండి.

"శ్రీ అసంగానంద గౌతమబుద్ధుల క్షమాగుణం ఎంతగా ప్రకాశించిందో, నిరూపింపదలచుకొంటే అదే ఒక మహాకావ్యం అవుతుంది. తన్ను భిక్షకై పిలిచి సూకరమర్దనం వడ్డించిన మహాపాపియగు చందుని క్షమించిన బుద్ధుడు సామాన్య పాపులను క్షమించుటలో ఆశ్చర్యమేమున్నది ? అట్లే శ్రీ అసంగానందులును తమ సంఘంలోనే వ్యతిరేక భావంతో తమ్ము విడిచి పోయి దుష్ప్రచారం చేసిన వారిని, పతనం చెందిన వారిని ప్రేమతో చేరదీసి చక్కని మార్గంలో పెట్టిన సందర్భాలేన్నో వున్నాయి. అనేక దినాలు శుశ్రూష చేసిన భక్తుడొకడు అనుజ్ఞ పొందకయే స్వతంత్ర ప్రచారకుడుగా బయలుదేరి క్రమక్రమంగా పతితుడై గృహస్థుడుగా మారి కడకు పశ్చాత్తాప పడి రాగా శ్రీ అసంగానందులు ప్రేమతో ఆదరించి చిరునవ్వుతో ప్రక్కన నిలబడి అతనికి ప్రాయశ్చిత్తం చేయడాన్ని నేనొకసారి వ్యాసాశ్రమంలో స్వయంగా చూచాను. చోరవృత్తితో జీవితం గడపుచు కడకు విరక్తుడై శ్రీ అసంగానందుల నాశ్రయించగా భగవద్ధ్యానం చేస్తూ మూడు సంవత్సరాలు భిక్ష మెత్తుకొంటూ తీర్థాటనం చేయవలసిందిగా ఆజ్ఞాపించారనీ, అందుకే ఇలా తిరుగుతున్నాననీ ఒక భిక్షువు నాతో 1940లో తాటిపర్తిలో స్వయంగా చెప్పాడు. అంతెందుకు ?

1936లో ఉంగుంటూరులో జరిగిన సనాతన సభలో వందలకొలది జనసమూహంతో స్వామి నెదుర్కొని వ్యతిరేక ప్రదర్శనలతో నానా భీభత్సం చేసిన నేను 1940 నాటికి భృత్యానుభృత్యుడనుగా మారిపోవుటలోనే వారిక్షమా గుణమెంత పరాకాష్ఠనొందినదో స్పష్టపడుతున్నది. (అసంగానంద గౌతమ బుద్ధులు 27-28 పుటలు)

ఇలాంటి ఘట్టాలు శ్రీ సద్గురు స్వామి జీవితంలో ఎన్నో వున్నాయి. క్షమతో లోకాన్ని జయించిన చరా చరసుఖాభిలాషికి ప్రణామాలు.

- శ్రీ మాతా గురుచరణానన్న

జ్ఞాన సుధ

మూలం
శ్రీ సర్పభూషణ శివయోగి వారు

అనువాదం :
శ్రీ శంకరానందగిరి స్వాములవారు
(ఉమామహేశ్వర పీఠాధిపతులు)

అవ : "ద్వితీయాద్వై భయం భవతి " అను శ్రుత్యభిప్రాయమును దృష్టాంత పూర్వకముగా వివరించుచున్నారు -

ద్వైతతో దుఃఖ మద్వైతత సౌఖ్యము
న్మీలతే తత్తయో ర్బాలకాంత్యం భజ,
కిం న పాథేయ మధ్వన్యపుంసో భవేత్
ఖేదకృ ద్రక్షణా న్మోదకృ ద్భక్షణాత్ . ౫౨

బాలక = వత్సా ! ద్వైతతః = భేదమువలన, దుఃఖం = దుఃఖము, అద్వైతతః = అభేదమువలన, సౌఖ్యం= ఆనందము, ఉన్మీలతే= ఆలరారు చున్నది. తత్ = అందువలన, తయోః = ద్వైతము, అద్వైతము అనునా రెండింటిలో, అంత్యం = చివరి దానిని, అద్వైతమును, భజ=సేవింపుము. అధ్వన్య పుంసః = మార్గస్థుడైన పురుషునకు , పాథేయం= దారిబత్తెము (చద్ది)రక్షణాత్ = రక్షించుట (మోయుట) వలన, ఖేదకృత్ = దుఃఖకరము, భక్షణాత్ = భుజించుట వలన, మోదకృత్ = సుఖకరము, న భవేత్కిం= కాదాయేమి ?

నాయనా ! జీవేశ్వరభేదముతో గూడిన ద్వైతదృష్టి వలన దుఃఖము కలుగును. అభేదదర్శన రూపమైన అద్వైతము వలన ఆనందము వెల్లివిరియును. కావున ఆత్మైకత్వ దృష్టి యనెడి అద్వైత దర్శనము నవలంబింపుము. పథికుడగు వాని భుజముపై నుండిన చద్దియున్నపు మూటను మోయుచుండుటచే అది వానికి శ్రమను గలిగించును. అదే చల్దిని తాను ఆరగించినచో ఆ పిదప బరువుపోయి బలము చేకూర్చును. అనగా ఆ చద్దియన్నము తనకంటె అన్యముగా భుజముపై మోయబడుచున్నంత కాలము బరువును, శ్రమను కలిగించునదగును. భుజించినచో ఆ చద్దియన్నమే శ్రమను దుర్బలతను పోగొట్టి బలమును చేకూర్చును. ఇట్లే ద్వైతదృష్టియందు ఉన్నంతవఱకు అది భారమును కలిగించును. దుర్బలతకు కారణమగును. అద్వైతదృష్టియో ఈ భారమును తొలగించును. బలమును, స్వతంత్రతను కలిగించును. నిరతిశయ సుఖమును ప్రసాదించును.

హనుమంతుడు

– శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు

హనుమంతునితో పరిచయము రామాయణంలో కిష్కింధాకాండ నుండి ప్రారంభమగును. ప్రథమ పరిచయమునుండి చివరివఱకు హనుమంతుడు తన అపూర్వప్రాభవముచే జనుల హృదయములను సంభ్రమాశ్చర్యములలో ముంచెత్తుచుండును. తన బలపరాక్రమముచేతను, కార్యదక్షతచేతను, వినయవిధేయతలచేతను, కర్తవ్యనిష్ఠ చేతను వారు అందఱి హృదయమందు సుస్థిరనివాసమును కలుగజేసికొన గల్గిరి ఉత్సాహము, నిర్భయత్వము, పవిత్రత, ప్రభుభక్తి, ఇంద్రియ నిగ్రహము, విద్యావైదుష్యము, మొదలగు ఉదాత్తగుణములన్నియు హనుమంతునియందు మూర్తీభవించియున్నవి.

భాషానైపుణ్యము :

హనుమంతుడు మహాపండితుడు, స్పష్టమగు ఉచ్చారణ కలవాడు. అతని వాక్కునందు అపశబ్దమేమియు లేకుండును. అతని తోటి ప్రథమ పరిచయమందు శ్రీరాముడు లక్ష్మణునితో నిట్లుచెప్పెను.

1. నానృగ్వేదవినీతస్య నాయజుర్వేదధారిణః ।
నాసామవేదవిదుషః శక్యమేవం విభాషితుమ్ ॥

2. నూనం వ్యాకరణం కృత్స్నమనేన బహుధా శ్రుతమ్ ।
బహు వ్యాహరతా౽నేన న కించిదపశబ్దితమ్ ॥

‘ ఎవరికి ఋగ్వేదముయొక్క శిక్షణ లభించలేదో, ఎవరు యజుర్వేదము యొక్క అభ్యాసము చేయలేదో, ఎవరు సామవేదమున విద్వాంసుడుకాదో, అట్టివారు ఈప్రకారముగ సుందరభాషయందు సంభాషణ గావింపలేదు. నిక్కముగ వీరు వ్యాకరణమునంతను పెక్కుసార్లు

స్వాధ్యాయము చేసియుండిరి. ఏలయనిన, చాలవాక్యములు పలికినను వీరి నోటినుండి ఒక్క అపశబ్దమైనను రాలేదు’.. శ్రీరాముని ఈ వచనములచే హనుమంతుని భాషా నైపుణ్యము, పాండిత్య ప్రకర్షద్యోతకములగుచున్నవి.

బలపరాక్రమములు : హనుమంతుని శక్తిసామర్థ్యములు, బలపరాక్రమములు ఊహాతీతమైనవి. నూఱు యోజనముల విస్తీర్ణముగల మహాసముద్రమును ‘సాగరం గోష్పదాయతే’..... అనునట్లు వారు గోష్పదజలమునువలె అవలీలగ దాటివైచెను. ‘ఉత్తమ పరాక్రమశాలియగు హనుమంతుడు నూఱుయోజనముల సముద్రమును దాటియు ఒక్కసారియైనను దీర్ఘశ్వాసమును గైకొనలేదు. మఱియు క్లేశము ననుభవించలేదు. (అనిశ్వసన్ కపిస్తత్ర). పైగా వారిట్లు తలంచుచుండిరట..... ‘నేను వందలకొలది యోజనముల వైశాల్యము గల పెక్కుసముద్రములను దాటగలను. ఇక ఈస్వల్పమైన నూఱు యోజనముల సముద్రమును దాటుట నాకొక లెక్కా!’ ఈ వాక్యముల ద్వారా వాల్మీకి హనుమంతుని అప్రాకృతశక్తిస్తోమతలను వెల్లడి చేసెను.

సుగ్రీవుడు హనుమంతుని యెదుట సీతాన్వేషణ రూప ప్రయోజనమును విశేషముగనుంచెను. ఏలయనిన హనుమంతుడు ఇక్కార్యమును సాధించగలడను దృఢవిశ్వాసమాతనికి కలదు. అతడు హనుమంతునితో నిట్లు చెప్పెను **– ఆంజనేయా !**

‘ తేజసా వాపి తే భూతం న సమం భువి విద్యతే ’

‘ఈ భూమండలమున మీయొక్క తేజస్సుతో సమానమైన తేజము కలవాడెవడును లేదు. కావున ఏ ప్రకారము సీత లభించగలదో, ఆ యుపాయమును మీరే ఆలోచించుడు’ – సుగ్రీవుని వాక్యములను వినిన పిదప వారీ కార్యమును సఫల మొనర్చుటయందు సమర్థులని శ్రీరామునకున్ను స్వయముగ అనుభవమునకు వచ్చి వారు తన పేరు

చెక్కబడియున్న ఉంగరమును సీతకు గుర్తుగా చూపుటకొఱకై హనుమంతున కిచ్చిరి.

సముద్రమును లంఘించుటకు ఉపక్రమించు సమయమున హనుమంతుడు అమితోత్సాహపూరితుడై తక్కినవానరులతోనిట్లు చెప్పెను.

వాసవస్య సవజ్రస్య బ్రహ్మణో వా స్వయంభువః ।

విక్రమ్య సహసా హస్తాదమృతం తదిహానయే

లంకాం వాపి సముత్క్షిప్య గచ్ఛేయమితి మే మతిః ॥

వానరులారా ! విదేహ కుమారియగు సీతను చూడగలనను నమ్మకము నాకు కలుగుచున్నది. వజ్రధారియగు ఇంద్రుని చేతినుండిగాని, లేక స్వయంభువగు బ్రహ్మదేవుని చేతి నుండిగాని బలపూర్వకముగ అమృతమును లాగికొని తక్షణమిచటికి తీసికొని రాగలను, లంకనంతను బూమి నుండి పెకలించి చేతితో ఎత్తుకొని రాగలను... అను విశ్వాసము నాకు గలదు '- హనుమంతుని ఈ వచనములచే వారి అలౌకిక సామర్థ్యము తేటతెల్లమగుచున్నది.

సముద్రమును దాటునపుడు మార్గమధ్యమున సురసకల్పించిన అవరోధమును శక్తియుక్తులచే దాటివైచి ఛాయాగ్రాహియగు సింహికయను రాక్షసిని సంహరించి విజయోత్సాహముచే ఆ కపీశ్వరుడు ముందునకు చనుచుండ అపుడు ఆకాశచారులు వారితో నివ్విధముగ పలికిరి.

యస్య త్వేతాని చత్వారి వానరేన్ద్ర యథా తవ ।

ధృతిర్దృష్టిర్మతిర్దాక్ష్యం స కర్మసు న సీదతి ॥

' వానరేంద్రా ! ఎవనియందు మీకువలె ధైర్యము, వివేకదృష్టి, కౌశల్యము - అను ఈ నాలుగు గుణములు ఉండునో, అతడు తన కార్యమందెన్నడును అసఫలత్వమును బొందనేరడు. ఆకాశచారుల

ఈపలుకులు హనుమంతుని ధైర్యస్థైర్యములను చక్కగ నిరూపించున్నవి.

ఇక లంకాపురిచేరిన పిదప తన్ను ప్రతిఘటించిన లంకారాక్షసిని పిడికిటితో కొట్టి ఓడించి లంకాపట్టణములోనికి ప్రవేశించెను. ఆమె స్త్రీ యని తలంచి హనుమంతుడు ఆమెను వధింపక వదిలివేసెను. సీతకొఱకు లంకయంతయు గాలించి గాలించి ఎట్టకేలకు అశోకవనమున ఆమెను దర్శించి పరమానందభరితుడై శ్రీరాము డొసంగిన అంగుళీయకమును ఆమెకొసంగి బహుభంగుల ఆమెకు ధైర్యమొనగూర్చి, ఆమెను దర్శించినందులకు గుర్తుగా చూడామణిని ఆమె నుండి బడసి ఆమెకు ప్రణమిల్లి వెడలిపోవుచు, ప్రధాన కార్యముతోబాటు మఱికొన్ని పనులుకూడ చేసి వెళ్ళుట ఉత్తమమని భావించి అందులకుద్యమించెను.

ప్రమదావనమును నాశనము చేసివైచెను. అడ్డువచ్చిన కింకరులను, రాక్షసులను హతమార్చెను. ప్రహస్తుని కుమారుడగు జంబుమాలిని సంహరించెను. మంత్రియొక్క ఏడుగురు కుమారులను యుద్ధమందు నాశమొనర్చెను. విరూపాక్షుడు, యూపాక్షుడు, దుర్ధరుడు, ప్రఘునుడు, బాసకర్ణుడు అను గొప్ప వీరులైన మంత్రి పుత్రులను పర్వత శిఖరము యొక్క ఆఘాతముచే చూర్ణముచేసి వైచెను. రావణుని పుత్రుడగు అక్షకుమారుని గిరగిర త్రిప్పి క్రిందపడవేసి అతని ప్రాణములను పోగొట్టెను.

పిమ్మట రావణునకు బుద్ధిచెప్పి లంకాపట్టణములో (విభీషణుని ఇంటికి తప్ప తక్కిన) భవనములన్నిటికి నిప్పంటించి ఆ ప్రదేశమును భస్మీపటలము చేసివైచి విజయోత్సాహముతో సముద్రమును దాటి శ్రీరాముని సన్నిధికి చేరెను. ఈ కార్యములన్నిటిచే హనుమంతుడు అప్రాకృతశక్తి సామర్థ్యములు కలవాడని, రామకార్యధురంధరుడని, రణధీరుడని స్పష్టమగుచున్నది.

ఇక రామరావణ యుద్ధములో హనుమంతుడు చూపిన అపారబలము, అద్భుత సాహసము వర్ణనాతీతము. ధూమ్రాక్షుడు, అకంపనుడు, దేవాంతకుడు, నికుంభుడు, త్రిశిరుడు మొదలగు గొప్ప నిశాచరులను వారు మట్టుపెట్టిరి. రావణునితో యుద్ధము చేయునపుడు అతని బాణసమూహమును నివారించుచు హనుమంతుడు అతనివైపు పరుగిడగా రావణుడు....

'సాధు వానర వీర్యేణ శ్లాఘనీయో ఽ సి మే రిపుః ।

'వానరుడా ! మంచిది. నీవు పరాక్రమమునందు నా యొక్క ప్రశంసనీయమైన ప్రతిద్వంద్విగా నున్నావు– ' అని హనుమంతుని పొగడగా అందులకా పవనకుమారుడు.....

ధిగస్తు మమ వీర్యస్య యత్త్వం జీవసి రావణ ॥

' రావణా ! నీ వింకను జీవించియున్నావు కావున నా పరాక్రమమునకు ధిక్కారము' -- అని ప్రత్యుత్తరమిచ్చి తన ధైర్యమును, నిశాచర సంహారమను లక్ష్యమును చక్కగ ప్రకటించెను.'

యుద్ధమందు హనుమంతుడు శ్రీరామచంద్రుని తన భుజములపై కూర్చుండ బెట్టుకొని ముందుకు కొనసాగెను. అత్తటి శ్రీరాముడు రావణునిపై ఆక్రమణము సలిపి అతని రథమును ఛేదించివైచెను. యుద్ధస్థలమున ఒక సమయమున రామక్ష్మణులిరువురును ఇంద్రజిత్తు యొక్క బాణములచే మూర్ఛపోగా, అపుడు జాంబవంతుని సలహాపై హనుమంతుడు తక్షణమే హిమాలయపర్వతము యొద్దకు ఎగిరపోయి ఓషధులచే పరిపూర్ణమగు ఆ పర్వతముయొక్క శిఖరమును గొనిరాగా, ఆ ఓషధులయొక్క సుగంధమును ఆఘ్రాణించి రామలక్ష్మణులు స్వస్థులైరి. ప్రచండవేగము కలవాడైన ఆ పవనకుమారుడంతట తిరిగి ఆ పర్వత శిఖరమును గొనిపోయి హిమాలయమున యథాస్థలమందు చేర్చివచ్చెను. ఇంతటి మహత్తర కార్యము సామాన్యులకు సాధ్యపడునా ? అమిత

తేజోవంతుడును, మహాబలశాలియునగు హనుమంతునకే అది సాధ్యపడినది. ఆ ప్రకారముగ కీలకసమయమున రామలక్ష్మణులకు క్షతగాత్రులైన తదితర వానరులకు హనుమంతుడు మహోపకారమును కలుగజేసెను. హనుమంతుని బలము అమోఘము, అసామాన్యము.

రావణుడు హనుమంతుని ఖైదుచేసి తీసికొనివచ్చుటకై ఎనుబదివేల కింకరులను, రాక్షసులను పంపినపుడు హనుమంతుడు తన శరీరమును పెంచి విశాలాకారమును ధరించి తోక నేలపై కొట్టి ఆరాక్షసులను గద్దించి మహోత్సాహముతో పలికిన ఈ క్రింది వాక్యములు వారి అపారశక్తి సామర్థ్యములను, ధైర్యసాహసములను ప్రకట మొనర్చుచున్నవి.

1. జయత్యతిబలో రామో లక్ష్మణశ్చ మహాబలః ।
రాజా జయతి సుగ్రీవో రాఘవేణాభిపాలితః ॥

2. దాసో ఽహం కోసలేన్ద్రస్య రామస్యాక్లిష్టకర్మణః ।
హనూమాన్ శత్రు సైన్యానాం నిహన్తా మారుతాత్మజః ॥

3. న రావణ సహస్రం మే యుద్ధే ప్రతిబలం భవేత్ ।
శిలాభిశ్చ ప్రహరతః పాదపైశ్చ సహస్రశః ॥

4. అర్దయిత్వా పురీం లంకామభివాద్య చ మైథిలీమ్ ।
సమృద్ధార్థో గమిష్యామి మిషతాం సర్వరక్షసామ్ ॥

'మహాబలవంతుడగు శ్రీరామునకు జయమగుగాక! గొప్ప బలశాలియగు లక్ష్మణునకు జయమగుగాక ! శ్రీరామునిచే సురక్షితుడగు రాజైన సుగ్రీవునకు జయమగుగాక ! అనాయాసముగనే గొప్ప పరాక్రమమును చూపు కోసలరాజగు శ్రీరాముని దాసుడనునేను. నాపేరు హనుమంతుడు. నేను వాయువుయొక్క పుత్రుడను. మఱియు శత్రుసేనను సంహరించువాడను. ఎపుడు నేను వేలకొలది చెట్లతోను, రాళ్ళతోను

ప్రహారము సలుపదొడంగుదునో అపుడు వేలకొలది రావణులు కలిసి వచ్చినను లంకాపురమును సర్వనాశనము చేసివైచెదను. మఱియు మిథిలేశ కుమారియగు సీతకు ప్రణమిల్లి తదుపరి రాక్షసులందఱును చూచుచుండగనే నాకార్యమును సాధించుకొని వెడలిపోయెదను.

సీతతో సంభాషించునపుడు హనుమంతుడిట్లు చెప్పెను. దేవీ ! నిన్ను వీపుపై గూర్చుండబెట్టుకొని నేను సముద్రమును దాటివైచెదను. రావణ సహితముగ లంకనంతను మోసికొని వెళ్ళగలశక్తి నాకు కలదు.' మఱియొక సందర్భమున హనుమంతుడు 'నేనొక్కడనే రాక్షసులందఱిని వధించి వేయగలను. కాని రామాజ్ఞ అట్లులేదు' – అనియు వచించెను. హనుమంతుని అసాధారణ పరాక్రమము ఈ వాక్యములచే స్పష్టముగ తెలియుచున్నది.

వినయము :

ఈ ప్రకారముగ మహాబలోపేతుడైయున్నను హనుమంతునకు అహంభావము గాని, స్వాతిశయభావముగాని లేనే లేవు. సీతతో తన్నుగూర్చి పరిచయము చేయునపుడు తామొక సామాన్య తరగతికి చెందిన కోతియనియు, తనకంటె అధిక పరాక్రమము కలవారు ఎందఱో కలరనియు చెప్పుకొనెను. రాక్షసులతో తన్ను గూర్చి చెప్పునపుడు 'నేను శ్రీరామచంద్రుని దాసానుదాసుడను' (దాసో ఉ హం కోసలేన్ద్రస్య) అని చెప్పి తన విధేయతను ప్రకటించెను. సముద్రమును లంఘించు సమయమున సూర్యునకు, ఇంద్రునకు, వాయుదేవునకు, బ్రహ్మదేవునకు, భూతలములకు చేతులు జోడించి నమస్కరించెను. ఈ క్రియయలన్నియు హనుమంతుని నిరహంభావమును, వినయమును లెస్సగ సూచించుచున్నవి. లంకాపురియందు సీతాదేవిని దర్శించి, తిరిగి సముద్రమును దాటివచ్చి, ఆవార్తను వానరుల కెఱిఁగించి ....

రాఘవస్య ప్రసాదేన భవతాం చైవ తేజసా ।

సుగ్రీవస్య చ కార్యార్థం మయా సర్వమనుష్ఠితమ్ ॥

' శ్రీరాముని కృపచేతను, మీయొక్క ప్రభావముచేతను, నేను సుగ్రీవుని కార్యసిద్ధికొఱకై అంతయు నేరవేర్చితిని' –అని హనుమంతుడు వినయముతో చెప్పుకొనెను. తన విజయమునకు కారణము శ్రీరాముని అనుగ్రహమేయని సూచించెను. ఇట్టి నిరహంభావమే హనుమంతుని ఔన్నత్యమునకు ప్రబలహేతువైయున్నది. హనుమంతుడు అంతరింద్రియ, బహిరింద్రియ నిగ్రహం కలవాడు. అతడు రావణుని అంతఃపురమున నిద్రించుచున్న స్త్రీలలో సీతయున్న దేమో యని రాత్రివేళ జాగ్రత్తగ పరికించి చూచెను. కాని ఎచటను ఆమె కానరాలేదు. అపుడు హనుమంతుడు తనలో నిట్లు చింతన చేసెను.

'రావణుని స్త్రీలు నిశ్శంకగా నిదురించుచున్నారు. ఇట్టి స్థితిలో నేను వారందఱిని బాగుగ చూచితిని. కాని నామనంబున ఏవిధమైన వికారము జనింపలేదు.

మనో హి హేతుః సర్వేషామిన్ద్రియాణాం ప్రవర్తనే ।

'ఇంద్రియములన్నిటిని శుభ అశుభ అవస్థలయందు ప్రవేశించుటలో ప్రేరణ యొనర్చుటయందు మనస్సే కారణమైయున్నది. కాని నా యొక్క ఆ మనస్సు పూర్ణముగ స్థిరమై యున్నది'– హనుమంతుని ఈ వాక్యములు వారి ఇంద్రియ నిగ్రహమును సూచించుచున్నవి.

ఇంతటి మహత్తరచరిత్ర, సద్గుణ సంపద, ఉత్సాహము, బాహుబలము, మనః స్థైర్యము, సాహసము గలిగియుండుటవలననే సీతాదేవి వారిని ఈ ప్రకారము సంస్తుతించెను.

న హి త్వాం ప్రాకృతం మన్యే వానరం వానరర్షభ ।

యస్య తే నాస్తి సంత్రాసో రావణాదపి సంభ్రమః ॥

'వానరశ్రేష్ఠా । మిమ్ముల నొక సామాన్య వానరునిగ నేను తలంచుటలేదు, ఏలయనగా మీకు రావణునివంటి రాక్షసుని యెడల

కూడ భయముగాని, కంగారుగాని లేకున్నది.' శ్రీరాముడు అగస్త్యునితో నిట్లనెను–'మహర్షీ ! రావణునికంటె వాలి, గొప్ప బలవంతుడను విషయమందు సందేహములేదు. కాని వీరిరువురి బలముకంటె హనుమంతుని బలము చాల ఎక్కువని నేను తలంచుచున్నాను.

శౌర్యం దాక్ష్యం బలం ధైర్యం ప్రాజ్ఞతా నయసాధనమ్ ।

విక్రమశ్చ ప్రభావశ్చ హనూమతి కృతాలయాః ॥

'శౌర్యము, దక్షత, బలము, ధైర్యము, ప్రజ్ఞ, నీతి, పరాక్రమము, ప్రభావము అను ఈ సద్గుణములన్నియు హనుమంతునియందు నెలకొనియున్నవి'. .... శ్రీరాముని ఈ వాక్యములు హనుమంతుని అనుపమ సామర్థ్యమును వెల్లడి చేయుచున్నవి.

ఇక ప్రతిపక్షనాయకుడగు రావణుడే ఒక సందర్భములో హనుమంతుని శౌర్యమునుజూచి ఈ ప్రకారముగ తనలో భావించుకొనెను.

కిమేష భగవాన్ నన్దీ భవే త్సాక్షాదిహాగతః ।

' ఈ వానరుని రూపమున సాక్షాత్ భగవంతుడగు నందికేశ్వరుడే ఇచటికి వచ్చెనా ఏమి ? అట్లే రావణుని మంత్రియగు ప్రహస్తుడు పవన కుమారునితో...

న హి తే వానరం తేజో రూపమాత్రం తు వానరమ్ ।

'హనుమంతా ! నీరూపము వానర రూపమేకాని నీ తేజస్సు (బలము) వానర తేజస్సు కాదు' అని పలికి హనుమంతుని శౌర్యమును ఉగ్గడించెను.

ఇక హనుమంతుని బలపరాక్రమములను జూచి తక్కిన రాక్షసులు తమలో తామిట్లనుకొనిరి ... 'ఈతడు దేవతల రాజగు వజ్రధారియైన ఇంద్రుడో, లేక సాక్షాత్ యమధర్మరాజో అయి యుండవచ్చును, లేక, వరుణ, వాయు, రుద్ర, అగ్ని, సూర్య, కుబేర, చంద్రులలో ఒకడై

యుండవచ్చును. ఇతడు వానరుడు కాదు. మహాప్రస్థాన సమయమున హనుమంతుడు శ్రీరామునితో .. 'మహాత్మా! ఈ భూతలముపై రామకథ ఎంతవఱకుండునో, అంత వఱకు నిక్కముగ నా ప్రాణము ఈ శరీరమందే ఉండుగాక !' అని ప్రార్థింపగా, అందులకు శ్రీరాముడు చాల సంతసించి..

చరిష్యతి కథా యావదేషా లోకే చ మామికా !

తావత్తే భవితా కీర్తిః శరీరే ఽ ప్యసవస్తథా ॥

అట్లే యగుగాక ! ప్రపంచమున నా కథ ఉండునంతవఱకు, మీ కీర్తి అక్షయముగ ఉండును. మఱియు అంతవఱకు మీ శరీరమున ప్రాణమున్ను ఉండును. ఈ లోకములుండు వఱకు నా కథలున్ను స్థిరముగ నుండును.

ఏకైకస్యోపకారస్య ప్రాణాన్ దాస్యామి తే కపే ।

శేషస్యేహోపకారాణాం భవామ ఋణినో వయమ్ ॥

ఆంజనేయ ! మీరు ఏమేమి ఉపకారములు చేసితిరో, వానిలో ఒక్కొక్క దానికిని నేను నా ప్రాణములను గూడ సమర్పింగలను. ఇక తక్కిన ఉపకారములకు నేను మీకు ఋణస్థుడనే అయియుందును'.... శ్రీరాముని ఈ వాక్యములచే రామచంద్రునకు హనుమంతునిపై ఎట్టి సదభిప్రాయముకలదో, ఎంతటి వాత్సల్యము కలదో చక్కగ ద్యోతకమగుచున్నది.

హనుమంతుడు వానర శరీరమును ధరించియున్నను తనయొక్క ప్రయత్నాతిశయముచే మానవత్వమును దాటి, దేవత్వమును దాటి సాక్షాత్ దేవుడే అయి వెలయుచున్నారు. కనుకనే శ్రీరాముని దేవాలయములతో బాటు హనుమంతుని దేవాలయములు కూడ వెలసియున్నవి. జనులు వారిని సాక్షాత్ దేవునిగనే ఆరాధించుచున్నారు. అతని సద్గుణములే, ఉదార చరిత్రయే ఇట్టి లోకోత్తరస్థానమును అతనికి (హనుమంతునికి) కల్పించినది. అతడు జగత్కళ్యాణకారకుడు. మూర్తీభవించిన సద్గుణరాశి..

మూలం

భాగవత కథలు – భక్త ధ్రువుడు

శ్రీరామచంద్రడోంగరే మహరాజ్ అనువాదం :

శ్రీ విద్యాస్వరూపానందగిరి స్వాములవారు

(గత సంచిక తరువాయి)

ప్రజలన్నారు – ధ్రువుడు నారాయణుని దర్శించి వచ్చినాడు. అంచేత మేము అతనిని దర్శించి కృతార్థులవుతాము – అని ధ్రువుని నరగయాత్రకు ఏర్పాట్లు చేయబడ్డాయి. ధ్రువుణ్ణి ఏనుగు అంబారిపై ఎక్కి ఊరేగించాలంటే అతడు – నేనొకణ్ణే ఊరేగను, నా తమ్ముడు ఉత్తముణ్ణి గూడ ప్రక్కన కూర్చుండబెట్టండి – అన్నాడు. మొదట ఉత్తముణ్ణి అంబారిపై కూర్చుండబెట్టి ఆ తరువాత ధ్రువుడు ఊరేగాడు ఎవడు తన సోదరి – సోదరులలో, బంధువులలో సంబంధీకులలో పరమాత్మను దర్శించజాలడో అతనికి భగవద్విగ్రహాలలో కూడ భగవద్దర్శనం కాజాలదు. నోటి మాటల ఉపదేశ ప్రభావం త్వరగా కలుగదు. కానీ ఆచరణతో కూడిన ఉపదేశ ప్రభావం త్వరగా కలుగుతుంది.

సురుచి ఇప్పుడు పశ్చాత్తాపపడసాగింది. సునీతి పాదాలపై శిరస్సు నుంచి ఏడుస్తూంది. ఆమె యొక్క కన్నీటితోపాటు ఆమె యొక్క మనో మాలిన్యం కూడ కడిగివేయబడింది. ధ్రువునికి పట్టాభిషేకం చేయబడింది. మఱియు భ్రమి అనే కన్యారత్నంతో వివాహం కూడా జరిగింది.

ఒకనాడు ఉత్తముడు వేటకు అడవికి పోయాడు. అచట యక్షునితోటి యుద్ధం జరుగగా అందు ఉత్తముడు మరణించాడు ఆ దుఃఖప్రద సమాచారాన్ని తెలుసుకొనిన ధ్రువుడు అచటికి పోయాడు భయంకరయుద్ధం చేసి యక్షుణ్ణి సంహరించబోయాడు. ఆ సమయానికి ధ్రువుని తాత మనుమహారాజు అచటికి వచ్చాడు. ఆయన ధ్రువునితో అన్నాడు కుమారా ! వైష్ణవులు (విష్ణు భక్తులు) వైరం కలిగివుండరు. విష్ణువు ప్రేమ స్వరూపుడు. తన రొమ్ముపై కాలితో తన్నిన భృగుమహర్షికి కూడ విష్ణుభగవానుడు ప్రేమనే పంచాడు.

శివుడు వైరాగ్య స్వరూపుడు. అతిప్రేమ, అతి వైరాగ్యం ఈ రెండింటిని నిర్వహించడం కఠినము. జ్ఞాని అతిశయ వైరాగ్యం కలిగి వుండాలి. వైష్ణవుడు అతిశయ ప్రేమను కలిగి వుండాలి.

మను చక్రవర్తి అంటాడు – "తితిక్షయా కరుణయా మైత్ర్యాచ అఖిల జన్తుషు, సమత్వేన చ సర్వాత్మా భగవాన్ సంప్రసీదతి ॥ సంప్రసన్నే భగవతి పురుషః ప్రాకృతైర్గుణైః । విముక్తో జీవనిర్ముక్తో బ్రహ్మ నిర్వాణ మృచ్ఛతిం (భా 4/11/13/14) తనకంటే పెద్దవారి విషయంలో సహనశీలత, చిన్నవారి విషయంలో దయ, సమాన వయస్సు గల వారితో మైత్రి, సమస్త జీవులతోటి సమాన వ్యవహారం చేయడం వలన సర్వాత్మయగు శ్రీహరి ప్రసన్నుడౌతాడు. సహనశీలత, అన్ని ప్రాణులపై కరుణ, జగత్తులోని ప్రతి ఒక్క జీవునితో మైత్రి – అను నీ మూడు గుణాలచే కూడిన వ్యక్తి సుఖవంతుడౌతాడు. అతనిపై భగవంతుడు ప్రసన్నుడౌతాడు. భగవంతుడు ప్రసన్నుడవడం వలన ప్రాకృతిక గుణాలు అట్లే లింగ శరీరాలతో ముక్తుడై సుఖస్వరూప – ఆనంద స్వరూప బ్రహ్మప్రాప్తి కలుగుతుంది.

మను చక్రవర్తియొక్క ఉపదేశాన్ని విని ధ్రువుడు యక్షుని సంహరించడాన్ని (యక్ష సంహారాన్ని) ఆపి వేశాడు. ధ్రువుడు విశాల క్షేత్రానికి వచ్చాడు. ఆయన బాలకుడుగా వున్నప్పుడు యమునా తీరానికి వెళ్ళాడు. ఇపుడు వృద్ధావస్థలో గంగాతీరానికి వచ్చాడు. గంగాతీరంలో కూర్చొని ధ్రువుడు భజనలు – కీర్తనలు చేయ సాగాడు. గంగాప్రవాహ శబ్దంతో ధ్రువుని ధ్యానంలో విక్షేపం కలుగజొచ్చింది. అంచేత ఆయన గంగాతీరాన్ని వదలి పెట్టాలనుకొన్నాడు. అపుడు గంగాదేవి సాక్షాత్కరించింది. ధ్రువుడన్నాడు. తల్లీ ! ఈ నీ కలకలనాదం నా భగవద్ధ్యానంలో విక్షేపాన్ని కలుగజేస్తూంది. అందుకు గంగాదేవి బదులు చెప్పింది. నీవు శాన్తిగా ధ్యానం చేస్తున్నావు. గాన నేను కూడ ఇక ఇపుడు శాంతిగా ధ్యానం చేస్తాను. ఇక నేనెపుడూ శబ్దం చేయను. నీవిచటి నుండి పోవద్దు – అని గంగానది శాంతించింది. ఋషీకేశ్ సమీపంలో ధ్రువాశ్రమం దగ్గఱ గంగానది నేడున్ను శాంతంగానే వుంది.

ఒకనాడు భగవంతుని ఆజ్ఞచే ధ్రువ కుమారుణ్ణి తమతోటి తీసుకపోడానికి విమానం తీసుకొని పార్షదులు వచ్చారు. గంగాతీరాన్ని

వదలి వైకుంఠానికి పోవడానికి ధ్రువునికి ఇచ్ఛలేదు. నేను గంగాతీరంలో వుండి సత్సంగము, భజన, ధ్యానం మొదలైన వానిలో నాకే ఆనందం కలుగుతూందో అది వైకుంఠంలో ఎలా లభిస్తుంది ? గంగకు సాష్టాంగ నమస్కారం చేసి ఆయన అంతిమస్నానం చేయసాగాడు. గంగను వదలిపెట్టుతూ ఆయన హృదయం వేదనతో నిండింది.

గంగాదేవి ప్రత్యక్షమైంది. ధ్రువుడు గంగాదేవితో చెప్తున్నాడు – భగవదాజ్ఞచే నేను నిన్ను వదలి వైకుంఠానికి పోతున్నాను. నీ తీరంలో కలిగిన ఆనందం వైకుంఠంలో ఎలా లభిస్తుంది ? ఆ మాటవిని గంగాదేవి ప్రేమతో అనింది. ఇదినా భౌతిక స్వరూపం. వైకుంఠంలో నేను ఆధి భౌతిక స్వరూపంతో వుంటున్నాను. ధ్రువుడు గంగకు ప్రణామం చేశాడు. అందరికి ప్రణామం చేసి ధ్రువుడు వైకుంఠానికి పోయాడు. ఆయన వినయ మూర్తి.

మృత్యుదేవత ధ్రువుని సమీపించి తలవంచింది. ధ్రువుడు ఒక పాదాన్ని మృత్యువుయొక్క తలపై వుంచి రెండో పాదాన్ని విమానంలో వుంచాడు. విమానంలో కూర్చొని భగవద్ధామం వైకుంఠం చేరాడు. ధృవుడు వైకుంఠానికి పోవడం వలన అందరికి ఆనందం గల్గింది.

ధ్రువుడు అర్థార్థి భక్తుడు. ధ్రువుడు భగవంతుని శరణాగతి స్వీకరిస్తే భగవంతుడు ఆయనకు దర్శనాన్నిచ్చాడు. రాజ్యాన్నిచ్చాడు. ఆఖరులో వైకుంఠ వాసాన్ని కూడా ఇచ్చాడు. ఇది భగవంతుని యొక్క అనన్య శరణాగతి ఫలము.

ధ్రువుని దృష్టాంతంచెబుతూంది అచంచలమైన నిశ్చయంచే అత్యంత కఠినమైన కార్యం కూడ సిద్ధిస్తుంది అని. కానీ ఈ నిశ్చయం ఎలా కలగాలి ? "దేహం వా పాతయామి కార్యం వా సాధయామి " కార్యమును సిద్ధింప చేస్తాను, లేకపోతే మరణిస్తాను. దేహ త్యాగం చేస్తాను " అని. ఈ జన్మలోనే భగవంతుని దర్శించాలంటే బాల్యం నుండే ధ్యానం చేయాలి' అని ఈ దృష్టాంతం తెలుపుతూంది. బాల్యావస్థలో కలిగిన మంచి సంస్కారాలు నశించవు. సునీతి వలె మీరు కూడా మీ బిడ్డలలో బాల్యావస్థ నుండే ధార్మిక సంస్కారాలను కలుగ చేయండి. **ఓమ్**

అద్వేష్టా సర్వభూతానాం భాగవతము

– ఆచార్య జక్కంపూడి మునిరత్నం (తిరుపతి)
– ఆచార్య కె. సర్వోత్తమరావు, తిరుపతి

(గత సంచిక తరువాయి)

ఈ గీతావాక్యం భక్తియోగమనే పన్నెండవ అధ్యాయంలో పదమూడవ శ్లోక పూర్వభాగం. సర్వభూతాల పట్ల ద్వేషభావంలేక సమానంగా చూడమని భావార్థం. ఇతరులను ద్వేషించడం తన్ను తాను ద్వేషించుకోవడమని విశాలార్థం.

ద్వేషానికి కారణాలెన్నో. ఒకరి ఉన్నతి చూడలేకపోవడం. పాత కాలంలో ఇరుగు పొరుగు దేశాల ఉన్నతి సహించలేకపోవడం. వ్యక్తుల విషయంలో అయితే రూపవిద్యాధనాదులలో ద్వేషం. ఇది రగిలే కార్చిచ్చు లాంటిది. ఈ నేపథ్యాల కనుగుణమయిన కథను అనుసంధానం చేసుకోవడం సబబు.

కాశి, కోసల రాజ్యాలు దగ్గరదగ్గరివి. అయినా 21 సంవత్సరాలుగా వైరంలో రగులుతుండేవి. ఒకతరంలో కాశీరాజు బ్రహ్మదత్తుడు సైన్యంతో కదలి కోసలను ఆక్రమించాడు. కోసలరాజుకు అప్పుడు సంతానం లేదు. అయినా భార్య నిండు చూలాలు. అంచేత కోసలరాజు చూలాలు భార్యతో కలిసి రాజ్యం వదలి కాశికి కదిలాడు. ఒక కుమ్మరి ఇంట తలదాచుకొన్నాడు. ఆ ఇంటనే కోసలరాజు భార్య ప్రసవించింది. కోసలరాజు దీధితి తన కొడుకుకు 'దీర్ఘాయువు' అని పేరు పెట్టాడు. తనకు తెలిసిన విద్య అంతా నేర్పాడు. ఆ తరువాత తండ్రి కొడుకుని రహస్య ప్రదేశం తీసుకువెళ్ళి తన సంగతి అంతా చెప్పి 'ఎక్కడయినా దూరదేశం వెళ్ళిపో. మంచి రోజులు వస్తాయి. కోసల రాజ్యం దక్కుతుంద'ని చెప్పి పంపేశాడు.

కాశిరాజు కోసలరాజు ఆచూకి కనుక్కోలేక చివరకు ఆ ప్రయత్నం మానుకొన్నాడు. కొన్ని రోజులు గడిచాయి. కోసలరాజుకు క్షౌరం చేసే

ఒక క్షురకుడు కోసలరాజు నిష్క్రమణ తరువాత సామాన్యులకు క్షౌరకర్మ చేయడానికి ఇష్టపడక పని మానుకొన్నాడు. రోజులు దుర్భరమయ్యాయి. తీర్థయాత్ర నెపంతో పయనం కట్టాడు. కాశీ రాజ్యం ప్రవేశించాడు. ఊరిబయట తిరుగుతుంటే కుండలు చేసేవానిని చూచాడు. అతనికి అనుమానం కలిగింది. అతని రూపురేఖల్లో రాజలక్షణాలు కనిపించాయి. మరి తీక్ష్ణంగా చూచాడు. చివరకు అతడే కోసలరాజని నిర్ధారణ అయింది.

అయితే ఆ క్షురకునికి చెడుబుద్ధి పుట్టింది. ఇతని ఆచూకి కాశీరాజుకు చెబితే ధనప్రాప్తి అని వెళ్లి రాజుతో చెప్పాడు. కాశీరాజు పకడ్బందిగా దీధితిని, అతని భార్యను బంధించాడు. ఇద్దర్ని నాలుగువీధులు త్రిప్పి చివరకు వధ్యశాలలో చంపమన్నాడు. సరిగ్గా అదే సమయానికి

ఎవరి కెఱుక ?

... దగ్గర హడావిడి చూశాడు. నౌఖర్లు పిచ్చాపాటి ...ం దగ్గరికి వెళ్ళాడు. దీధితి 'దీర్ఘాయవుతో ...ద్వేషంతో చల్లారదు. మైత్రితో చల్లారుతుంది. ఈ హితోపదేశం మరవకు' అన్నాడు. ఈలోగా ఉరివేసేవారు అక్కడికి

– ఆచార్య కె.సర్వోత్తమరావు (తిరుపతి)

చేరి దీర్ఘాయువును తరిమేశారు. ఆపై దీధితిని అతని భార్యను చంపేశారు.

బ్రహ్మదత్తుని పగ అంతటితో తీరలేదు. కుమ్మరి వాణ్ణి ప్రశ్నించాడు. దీధితికి కొడుకున్నాడని తెలిసింది. అతని ఆచూకి తెలియదని కూడా తెలిసింది. కాశీరాజు భయపడ్డాడు. అగ్నిశేషం, ఋణశేషం, శత్రుశేషం ఉండకూడదని మరల అన్వేషణ సాగించాడు.

ఒకరోజు బ్రహ్మదత్తుడు నిదరపోతూ వుండగా 'గజశాల నుండి 'వేణునాదం' వినిపించింది. బ్రహ్మదత్తుడు పరవశుడయ్యాడు. ఎవరో కనుక్కోమని నౌఖరును ఆదేశించాడు. గజశాలాధికారి రాజుతో 'మహారాజా! ఎవరో తెలియదు. ఈ మధ్యనే వచ్చాడు. చాలా మంచివాడు అన్నాడు. ఆ కుర్రవాణ్ణి తన దగ్గరికి పంపమన్నాడు.గజశాలాధికారి ఆలాగే చేశాడు.

బ్రహ్మదత్తునికి 'వేణునాదం' చాలా ఇష్టం. అంచేత దగ్గరికి పిలిపించుకొని మరి మరి వినేవాడు. వారిద్దరి వయస్సులో తేడావున్నా

స్నేహం బలపడింది. ఇద్దరు కలిసి వెళ్ళేవారు. ఒకసారి రాజు దీర్ఘాయువుతో వేటకు వెళ్లాడు. దీర్ఘాయువు రథం నడుపుతున్నాడు. వేట సాగుతూ వుంది. క్రమంగా రథం పరివారాన్ని వదలి మరోవైపు కదలింది. రాజు గుర్తించలేదు. అయినా అప్పటికి మధ్యాహ్నం. కాస్త సేదదీరుదామని ఆశ్రమం కనబడుతుందేమోనని చూచారు ఆశ్రమం కనబడలేదు. దగ్గర మనిషి అలజడి లేదు. రథం నడిపే శుభదత్తుడనే దీర్ఘాయువు చూచాడు. ఒక కత్తివేటుతో రాజును చంపేద్దామనుకొన్నాడు.

ఈలోగా రాజు తనకు నిద్రవస్తుందని శుభదత్తుని తొడపై తల ఆనించి నిదరపోయాడు. శుభదత్తునిలో ఆరాటం హెచ్చింది. ద్వేషం బుసలు కొట్టింది. ఒక వేటుతో కడతేర్చాలనుకొన్నాడు. కాని వెంటనే తండ్రి మాటలు గుర్తుకు వచ్చాయి. ఈలోగా కాశీరాజు ఉలిక్కిపడిలేచి, 'శుభదత్తా ! నా శత్రువు దీధితి కొడుకు అమాంతం నా మీది కురికి తల నరకబోతున్నట్టు కలగన్నాను' అన్నాడు.

దీర్ఘాయువు ఆలోచించాడు. ఇంకా రహస్యం దాచడం మంచిది కాదనుకొన్నాడు. అన్ని విషయాలు చెప్పి తండ్రి చివరిమాటలు కూడా చెప్పాడు. అందుకే 'నేను ఇంతకాలం ఊరుకున్నాను' అని అన్నాడు. బ్రహ్మదత్తుడు దిగ్భ్రాంతుడయ్యాడు. అతని కాళ్ళ మీద పడ్డాడు. క్షమాభిక్ష యాచించాడు'

శుభదత్తుడు.,'మహారాజా ! నేను చంపాలనుకొంటే ఏనాడో పగతీర్చుకొనేవాణ్ణి. నేను తండ్రిమాటను జవదాటను. అడవి తల్లి సాక్షిగా నిన్ను చంపను. అదీగాక ఇంతకాలం నీతో స్నేహం చేశాను. మహారాజా! మీరు నాపట్ల మైత్రి కనబరచారు. ఈ మైత్రి చిరకాలం ఉండనీ' అన్నాడు.

కాశీరాజు శుభదత్తుని కావలించుకొన్నాడు. 'శుభదత్తా! నీ తండ్రి మహనీయుడు. ద్వేషానికి విరుగుడు చూపిన దీర్ఘదర్శి' అని కొనియాడినాడు.

ఈ రోజుల్లో ద్వేషం వికృతరూపంలో విలయతాండవం

చేస్తూవుంది. వర్ణద్వేషం, కులద్వేషం, జాతిద్వేషం, మతద్వేషం, బంధుద్వేషం, పార్టీలద్వేషం , ప్రాంతీయతల ద్వేషం, స్త్రీ పురుష ద్వేషం, సామాజిక జీవితంలో నిమ్నోన్నతాలకారణంగా ద్వేషం, కుటుంబ జీవితంలోని ఆదరణ అనాదరణ వల్ల కలిగే ద్వేషాలు మనం చూస్తున్నాం. వీటిని సాధ్యమయినంతవరకు అణచాలి. ఇవి 'విషవృక్షాలు'. సహనం, పెద్దరికం, చదువు, సంస్కారం ఈ ద్వేషాల్ని చాలవరకు అదుపులో పెడతాయి. శాంతి వాతావరణానికి సహకరిస్తాయి.

సంఘసంస్కర్తలు చాలవరకు 'ద్వేషాన్ని' పారద్రోలడానికి సహకరించారు. బసవేశ్వరుడు కులమతద్వేషాన్ని, గాంధీ హరిజన ద్వేషాన్ని ఈసడించినవారే. ఆలాగే దరిద్ర నారాయణ పేరుతో కుష్టురోగులని ద్వేషించక గాంధీ శుశ్రూష చేసినవాడే. డొక్కా సీతమ్మ తారతమ్యాలు లేక అందరికి అన్నపానీయాలు సమకూర్చిన సచ్ఛీల.

అద్వేష్టా సర్వభూతానాం మైత్రః కరుణ ఏవచ ।
నిర్మమో నిరహంకారః సమదుఃఖసుఖః క్షమీ ॥

కుమారస్వామి

శివుని తేజస్సు హిమాలయాలలోని రెల్లు గడ్డిపై పడి ఒక కుమారుడుదయించాడు. **శరవణ భవుడు** అను పేరు వచ్చినది. ఆ బాలునికి పాలివ్వడానికి ఇంద్రుడు 6 గురు కృత్తికలను నియమించాడు. ఆ పాలతో పెరిగినందు వలన **కార్తికేయుడు** అను పేరు కలిగెను.

ఈశ్వరుని నుండి జారిపడినందువలన **స్కన్దుడు** (జారిపడినవాడు) అని పేరు వచ్చినది.

ఆరుగురు కృత్తికల పాలను ఒకేమారు త్రాగాలన్నందువలన అతనికి ఆరుముఖాలు కలిగాయి. అందుచే **షణ్ముఖుడు** అను పేరు వచ్చినది. **(రామాయణం – బాలకాండ 37 సర్గ)**

శైవ సిద్ధాంతము – శైవాగమాలు

– **శ్రీ విద్యాస్వరూపానందగిరి స్వాములవారు**

(గత సంచిక తరువాయి)

కాశ్మీర శైవము :

శైవమతం అతిప్రాచీనం అని కొందరి మతం. ఇది వేదకాలం నుండే వుంది. కాబట్టి దీనిని శైవాగమం అన్నారు అని వీరి వాదము. ఈ శైవమతంలో శివాద్వైతం, విశేషాద్వైతం, వీరశైవం, పాశుపతం మొదలగు శాఖలు కలవు. అందు కాశ్మీర దేశంలో ప్రసిద్ధమైన శైవం శైవాద్వైతం లేక శివాద్వైతం అని, ప్రత్యభిజ్ఞాదర్శనమని, స్పందవాదమని, త్రికదర్శన మని అనబడినది. శైవాగమాలు ఈశ్వరుని ఐదు ముఖాల నుండి వెలువడిన వని శైవులవిశ్వాసము. ఇవి 25. ఇవిగాక కాశ్మీర శైవంలో ప్రత్యభిజ్ఞా దర్శనం, స్పందదర్శనం అని మరి రెండు గలవు. వీటికి చెందిన ఆగమాలు ఎనిమిది. వీనిలో ఒక్కొక్క దానిలో భైరవ, యామళ, మత, మంగళ, చక్రాష్టక, బహురూప, వాగీశ, శిష్టాష్టకాలని ఎనిమిది తంత్రాలు గలవు.

కాశ్మీర శైవములో వసుగుప్తుడు త్రికసంప్రదాయమును ప్రవర్తింపజేశాడు. వసుగుప్తుడు తనకు గోచరించిన మహాదేవగిరిపై శిలాఫలకంపై గల 77 శైవ సూత్రాలను గుర్తించి ఈ తత్త్వాన్ని ఉద్ధరించాడు. కల్లటుడు స్పందసిద్ధాంతాన్ని, సోమానందుడు ప్రత్యభిజ్ఞా సిద్ధాంతాన్ని ప్రచారం చేశారు. సోమానందశిష్యుడైన ఉత్పలాచార్యుని ఈశ్వరప్రత్యభిజ్ఞాకారిక ప్రామాణిక గ్రంథము. సోమానంద శిష్యుడైన ఉత్పలుని ప్రశిష్యుడు అభినవగుప్తుడు ప్రత్యభిజ్ఞాసంప్రదాయాన్ని సర్వప్రసిద్ధం చేశాడు. అభినవగుప్తుని ఈశ్వర ప్రత్యభిజ్ఞావిమర్శిని, వివృతవిమర్శిని, తంత్రసారం, తంత్రలోకం, పరమార్థసారం మొదలైనవి ప్రామాణిక గ్రంథాలు.

పాశుపతం శైవమతమునం దొకశాఖ. లకులీనుడు ఈమతస్థాపకుడు. ఈ పాశుపతమతస్థులు కారణము, కార్యము, విధి, యోగము, దుఃఖాంతము, అని ఐదు పదార్థాల నంగీకరించారు. పాశుపతులకు దైవనిర్ణయమందు అనగా విధియందు పూర్ణవిశ్వాసము. ఈ విధి (దైవనిర్ణయం) జీవుని పుణ్య – పాపకర్మల మీద ఆధారపడి వుండదు. దైవం మీదనే ఆధారపడి వుంటుంది. వీరిమతంలో కార్యం విద్య, కల, పశువు, అని మూడు విధాలు. అందు విద్య అనగా

జ్ఞానము. కలయనగా జీవులమీద ఆధారపడు అచేతనసృష్టి. పశువనగా బద్ధుడైన జీవుడు. ముక్తిస్థితిలో జీవులు భగవంతునితో సమానులై ఆయన ప్రతినిధులుగా కర్తవ్యాన్ని నెరవేరుస్తారు. వీరు సుఖదుఃఖాలను అనుభవించి క్రమంగా విరక్తిని బొంది శాస్త్రం చెప్పిన ప్రకారం మోక్షం కొఱకై దీక్షను గ్రహిస్తారు. దీక్షను తీసుకున్నవారు ఈశ్వర జ్ఞానాన్ని పొంది సన్న్యాసులవుతారు.

పాశుపతసిద్ధాంతంలో జీవిత నియమాలు : 1. దినానికి మూడుసార్లు భస్మస్నానం (విభూతి స్నానం) చేయాలి. 2. భస్మంపై పండుకోవాలి. 3. భగవంతుని స్తోత్రాలను పెద్దగా గానం చేయాలి. 4. నృత్యం చేయాలి. ఇదివీరి దినచర్య.

కాశ్మీరశైవ ప్రత్యభిజ్ఞాదర్శనంలో పరమశివుడు పరమతత్త్వము. అతడు శివశక్తి స్వరూపుడు. చైతన్యమైన ఆత్మ నిర్వికారమైనా ప్రపంచంలోని అన్ని పదార్థాలలోనూ వుంది. ఈతత్త్వమే చైతన్యము, పరసంవిత, పరమేశ్వరుడు, పరశివుడు, విశ్వమయుడైన విశ్వోత్తీర్ణుడు. చిత్రవిచిత్రంగా వున్న ఈ విశ్వమంతా పరమశివునికన్న భిన్నం (వేరు) కాదు. విశ్వమంతా శివునిస్ఫురణమే. పరమశివుడు అయిదురకాలయిన - చిచ్ఛక్తి, ఆనందశక్తి, ఇచ్ఛాశక్తి, జ్ఞానశక్తి, క్రియాశక్తి అను శక్తులతో కూడుకొని విశేషరూపంగా గోచరిస్తున్నాడు.

అందు చిచ్ఛక్తి ప్రకాశరూపము, స్వయంప్రకాశమానము, సర్వాన్ని ప్రకాశితం చేస్తుంది. 2. ఆనందశక్తి పరమేశ్వరుని నిరతిశయానందాన్ని సూచిస్తుంది. ఈ ఆనందానుభవంలో బాహ్యవస్తు వేదీ ఆపేక్షితం కాదు. 3. ఇచ్ఛాశక్తి స్వతంత్రబోధను కలుగజేస్తుంది. నేను హాని లేని ఇచ్ఛాసంపన్నుడను అన్న తెలివి యిందులో కలుగుతుంది. 4. జ్ఞానశక్తి పరామర్శరూపం. తెలియదగిన - తెలుసుకోవలసిన పదార్థాన్నిది సాధారణరూపంలో గుర్తింపజేస్తుంది. తెలుసుకోవలసిన పదార్థానికి ఉన్ముఖత్వాన్ని ఆపాదిస్తుంది. 5. క్రియాశక్తి సర్వకార్యాలను ధరింపజేసే యోగ్యత దీనిలో కలుగుతుంది. ఈశక్తి పంచక (ఈ అయిదుశక్తులు) యోగంచే పరమశివుడు విశ్వాకారంగా - జగత్తురూపంలో గోచరిస్తున్నాడు.

శైవాద్వైతమనే ఈ త్రికదర్శనం అద్వైతాన్నే బోధిస్తుంది. కాని ఉపనిషత్ప్రతిపాదిత బ్రహ్మవాదానికి, శివాద్వైతవాదానికి కొంతభేద ముంది. 1.ఉపనిషత్ప్రతిపాదిత బ్రహ్మవాదం (అద్వైతం)లో నిర్మలం నిర్వికారమైన బ్రహ్మానికి కర్తృత్వం లేదు. ఈ శివాద్వైతంలో పరమశివునకు కర్త ృత్వముంది. 2. ఇందలి (శివాద్వైతంలోని) ఆత్మ సృష్టి, స్థితి, సంహార - నిగ్రహ - అనుగ్రహాలనే పంచకృత్యపరాయణం. (**సశేషం).**

వార్తలు

(01). 26-3-2018తేది సోమవారం పునర్వసు నక్షత్రం నాడు ఉదయం శ్రీరామనవమి ఆశ్రమంలో జరుపబడింది. శ్రీరామచంద్రునికి వారిపరివారానికి షోడశోపచార పూజ జరిపి భక్తులకు ప్రసాదం వితరణ చేయబడింది. భక్తులకు అన్న ప్రసాద సంతర్పణ చేయబడింది.

(02). 25-3-2018 తేది సద్గురు సర్వసేవా ట్రస్టుబోర్డు సమావేశం జరిగినది. ఫిబ్రవరి ఆఖరు వరకు జరిగిన జమా ఖర్చుల ఆమోదం, 2018-19 బడ్జెట్ ఆమోదం జరిగినవి.

(03). 25-3-2018 తేది ఆదివారం శ్రీ శుకబ్రహ్మాశ్రమ పరిపాలనాసంఘ సమావేశం జరిగినది.

(04).27-3-2018 తేది మంగళవారం చైత్రశుద్ధ ఏకాదశినాడు పరమ పూజ్య శ్రీ సద్గురు మలయాళ స్వాములవారి జన్మదినోత్సవం శ్రీ శుకబ్రహ్మాశ్రమంలో జరిగినది.

(05).30-3-2018 తేది శుక్రవారం నాడు గురుదేవులు శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారి 20వ ఆరాధనోత్సవాలు జరిగినవి. ఉదయం శ్రీవారి సమాధి మందిరంలో శ్రీస్వామివారి మూర్తికి రుద్రాభిషేకం, అర్చనలు జరిగాయి. ఈ 3-4-2018 తేది శ్రీవారి జన్మదినోత్సవం ఆశ్రమంలో జరిగినది. ఈ సందర్భంగా 30-3-2018 నుండి 5 రోజులు ఉదయం పారాయణలు, మహాత్ముల ప్రవచనలు, మధ్యాహ్నం భజనలు, సంకీర్తనలు, సాయంకాలం మహాత్ముల ప్రవచనలు జరిగాయి. అన్ని ప్రాంతాల నుండి ఏప్రిల్ భేరిలో ప్రకటించిన మహాత్ములు , మఠాధిపతులు ఏతెంచి తమ దివ్య ఆధ్యాత్మిక ప్రవచనల నందించారు. ముంబయి, చెన్నై, షోలాపూర్, హైద్రాబాద్, తెలంగాణా, ఆంధ్రప్రదేశ్ అన్ని ప్రాంతాల నుండి భక్తులు వచ్చి ఈ ఉత్సవాలలో పాల్గొని ఆనందించారు. 3-4-2018న డా॥ ద్వారం లక్ష్మిగారి భక్తిగాన సుధాలహరి అందరిని ఆనందింపఱచింది. ఈ ఉత్సవాలకు శ్రీ సంపూర్ణానందగిరి స్వాములవారు అధ్యక్షత వహించారు.

(6). ఆశ్రమ కంటి ఆసుపత్రిలో **మార్చి నెలలో** ఓ.పి. విభాగంలో **838** మందికి చికిత్సలు జరిగాయి. **84 గురికి పొరలు ఆపరేషన్** జరిగి కళ్లలో లెన్సు అమర్చిబడినవి.